RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 01 జూలై 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:28

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు





హైదరాబాద్, జూన్ 30: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, ఐఏఎస్ మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఐఏఎస్ ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

# 30 నెలల్లో రైతు సంక్షేమానికి

## రూ.1.75 లక్షల కోట్ల వ్యయం - రేవంత్ రెడ్డి




గచ్చిబౌలిలోని శిల్పకళా వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులను విడుదల చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాలకు రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం గత 30 నెలలుగా రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక కీలక నిర్ణయాలు అమలు చేస్తోందన్నారు.

మిగతా 2లో

## హెచ్డీఎఫ్సీ బ్యాంక్ సీఎస్సార్ అభివృద్ధి పనులు ప్రారంభించి సీఎం రేవంత్



హైదరాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (ఊఖీ) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు ఆంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి గారు జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని పేర్కొంటూ మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎస్ఐఆర్-ఐఐసీటీ ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధన సౌకర్యాల ప్రారంభం

వార్తా 9 లో

## ముఖ్యమంత్రి ని కలిసిన సంజయ్ జాజు



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజు ఎంసీఆర్ హెచ్ఆర్ డీలోని బోధి పెవిలియన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, సలహా దారు, సీఎం ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె. రామకృష్ణా రావు కూడా ఉన్నారు.

## హైదరాబాద్ను గ్లోబల్ ఏరోస్పేస్ & డిఫెన్స్ క్యాపిటల్గా తీర్చిదిద్దుతాం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వార్తా 7 లో

## యాదాద్రి భూములపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మతాలకు భూముల కేటాయించడానికి సంబంధించి స్పష్టమైన విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భూ యాజమాన్యపు హక్కులు దేవస్థానంకే ఉండాలని చెప్పారుయాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఆలయం పరిధిలో భూముల కేటాయింపు విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ (చారిటబుల్) ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. గుట్టపైన అతిథి గృహాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారి జాబితా రూపొందించాలని, అతిథి గృహాల నిర్మాణాల్లోనూ టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అనుసరించాలని, దశల వారిగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపుపైన కూడా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం రూపొందించాలని అన్నారు.ఆలయ పరిధిలోవివిధ అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయం నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సమగ్రంగా అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు.ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్, , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, , ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తో పాటు దేవాదాయ, ఆర్థిక శాఖల, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అధికారులు పాల్గొన్నారు



Remembering
Former Minister of United Andhra Pradesh
M.MUKESH GOUD GARU
On his Birthday Anniversary

గోషామహల్ కాంగ్రెస్ పార్టీ
నాయకులు - కార్యకర్తలు - అభిమానులు

ప్రజాబలం

01 జూలై 2026 బుధవారం

# వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం.గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది.దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు.అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది.చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# వెంకటేశ్వర్ల సేవలు చిరస్మరణీయం: కోమండూరు శశి కిరణ్





హైదరాబాద్, జూన్ 30, 2026:లోక్ భవన్‌లో టైలర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఎం. వెంకటేశ్వర్లు అందించిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ సంయుక్త కార్యదర్శి కోమండూరు శశి కిరణ్ అన్నారు.

ఎం. వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం సాయంత్రం లోక్ భవన్ సుధర్మ లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కోమండూరు శశి కిరణ్ మాట్లాడుతూ...

లోక్ భవన్‌లో 36 సంవత్సరాలు టైలర్ ఎం. వెంకటేశ్వర్లు అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు.

ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఉద్యోగ ప్రస్థానంలో ఎం వెంకటేశ్వర్లు తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ జి. పల్లవి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మట్టయ్య, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, అసిస్టెంట్ కంప్ట్రోలర్ హెరాల్డ్, మేనేజర్ దీపక్, ఓఎస్డీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# 30 నెలల్లో రైతు సంక్షేమానికి

## రూ.1.75 లక్షల కోట్ల వ్యయం - రేవంత్ రెడ్డి





మొదటి పేజీ తరువాయి

రైతు ఆత్మగౌరవంతో వ్యవసాయం చేసుకునే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లలో వ్యవసాయం, సాగునీరు, ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, పంటల కొనుగోళ్లు, రైతు బీమా తదితర కార్యక్రమాల కోసం సుమారు రూ.1.75 లక్షల కోట్లను ప్రభుత్వం వెచ్చించినట్లు తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. రైతు రుణభారాన్ని తగ్గించేందుకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేసి, 25.35 లక్షల మంది రైతులకు రూ.20,677 కోట్ల మేర రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.

రైతు భరోసా పథకం కింద వార్షిక పెట్టుబడి సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని, ఇప్పటికే రూ.27 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. తాజా విడతలో మరో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు సాగు పెట్టుబడి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కోసం గత 30 నెలల్లో సుమారు రూ.30 వేల కోట్లు వ్యయం చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా వరి ధాన్యం కొనుగోళ్లు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్, వ్యవసాయ యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు.

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురైనప్పటికీ తమ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తోందన్నారు.

ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించడంతో పాటు సంక్షేమ పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూభారతి వ్యవస్థను ప్రవేశపెట్టి రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భూ రికార్డులను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతుల హక్కులను పరిరక్షించే విధంగా కొత్త వ్యవస్థ పనిచేస్తోందన్నారు. ప్రజలకు సులభమైన, పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన, యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు.

వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు.

తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని కోరారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పాలనకు మూల సూత్రాలని పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని క్రమబద్ధంగా అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా రైతాంగానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు స్థిరమైన ఆదాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, పంటల కొనుగోళ్లు, పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ విస్తరణ, ఎరువుల డిజిటల్ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, వరి ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సన్న వరివంగడాలు సాగు చేసే రైతులకు బోనస్ అందజేస్తామని, సాగునీటి వనరులను మరింత బలోపేతం చేసి తెలంగాణను సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, బలరాం నాయక్,ప్రభుత్వ విప్ లు, ఎంఎల్ఏలు, ఎంఎల్సీ లు, రాష్ట్ర రైతు సంఘం చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ సంస్థల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి చిలుక మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డి, ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం పాటించాలి

## :: ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 30**

**ములుగు**మంగళవారం ఎస్ఐఆర్--2026 కార్యక్రమంలో భాగంగా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కృష్ణవేణి వెంకటాపూర్ మండలంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 1, 7, 10, 15లను సందర్శించి ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు.




ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కింద ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందజేయడం, వాటిని సక్రమంగా పూరింపజేయించడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయడం వంటి అంశాలపై బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్యూమరేషన్ ఫారాల ఆన్‌లైన్ ధృవీకరణ, సమర్పణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు, ధృవీకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న రికార్డులు, అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నిర్వహణను పరిశీలించిన ఆమె, ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో వెంకటాపూర్ మండల తహసీల్దార్ గిరిబాబు, ఎన్నికల విభాగం సిబ్బంది నితీష్, ఆర్ఐ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రమణేశ్వరంలో అత్యంత వైభవంగా ఆత్మసాక్షాత్కార మహోత్సవ వేడుకలు



యాదాద్రి భువనగిరి జూన్30: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రమణేశ్వరంలో అత్యంత వైభవంగా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి 31వ ఆత్మసాక్షాత్కార మహోత్సవ వేడుకలు జరిగాయి.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ మహోత్సవంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు.

ఈ సందర్భంగా సిద్ధగురు ధ్యానాన్ని నిర్వహించగా, భక్తులు అత్యంత ఏకాగ్రతతో ధ్యానంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీచక్ర మహాలయంలో ప్రత్యేక అభిషేకాలు, బంగారు శివలింగానికి మహాభిషేకం మరియు హవనం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సిద్ధగురు ప్రసంగిస్తూ ఆత్మదర్శనం యొక్క గొప్పతనాన్ని వివరించారు. 1995 జూన్ 29న మాత పూర్ణానంద యోగిని వారి అనుగ్రహంతో, వారి శక్తిపాతం ద్వారా తనకు ఆత్మదర్శనం కలిగిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు ఆ దివ్య అనుభూతిని పొందినట్లు పేర్కొన్నారు.

ఆత్మదర్శనం అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, జీవభావం వంటి అన్ని పరిమితులను అధిగమించి, ఎలాంటి సంకల్పాలు, వికల్పాలు, భావాలు లేని దివ్య ప్రజ్ఞా స్థితిలో నిలవడమేనని సిద్ధగురు వివరించారు. అలాంటి దివ్య స్థితిని కోట్లలో ఒక్కరు మాత్రమే పొందగలరని చెప్పారు. కేవలం శాస్త్రాలు, వేదాలు అధ్యయనం చేయడం వల్ల భాషాజ్ఞానం, బుద్ధిజ్ఞానం మాత్రమే లభిస్తాయని, కానీ ఆత్మదర్శనం లభించదని స్పష్టం చేశారు. సద్గురువును ఆశ్రయించి, గురుసేవ చేస్తూ, గురుకృపను పొందినప్పుడే ఆత్మసాక్షాత్కారం సాధ్యమవుతుందని తెలిపారు.

ఈ మహోత్సవంలో పండిత్ గోపదేవ ప్రముఖ శిష్యుడు మసన చెన్నప్ప , అనేక మంది ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

ఆధ్యాత్మికత, గురుభక్తి, ధ్యానసాధన, వైదిక సంప్రదాయాల సమన్వయంగా నిర్వహించబడిన ఈ 31వ ఆత్మసాక్షాత్కార మహోత్సవం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. పాల్గొన్న భక్తులందరూ సిద్ధగురు ఆశీస్సులు పొందారు.

# డాక్టర్ నాగేష్ కురువ కు జాతీయ పురస్కారం



హైద్రాబాద్ జూన్ 30;త్యాగరాయ గాన సభ సాదర అదర కళా సమితి ఆద్వర్యం లో డాక్టర్ నగేష్ కురువ అనేక చేసిన సేవలను గుర్తించి కేంద్రం మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, దైవజ్ఞ శర్మ , సినిమా హీరో హిని కృష్ణవేణి నాయుడు సినిమా హీరో హిని హిందూజ బీజేపీ అధ్యక్షులు వంశీ సంస్థ అధ్యక్షులు వెంకటేష్ అందరు చేతులు మీదుగా డాక్టర్ నాగేష్ కురువ కు జాతీయ పురస్కారం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమం లో డాక్టర్ నగేష్ కురువ వారు మాట్లాడుతూ నన్ను గుర్తుయించి జాతీయ పురస్కారం ఇచ్చినందుకు సంస్థ అధ్యక్షులు వెంకటేష్ కు ధన్యవాదములు అలాగే నన్ను ముఖ్య అతిధులు గా పిలిచి గౌరవం ఇచ్చినందుకు ప్రతేక ధన్యవాదములు తెలిపారు.

# మర్పల్లి సయ్యద్ పటేల్ ఉరుసుపండగలో విందు ఏర్పాటుచేసిన సర్పంచ్ మధుగు రమేశ్వర్



**వికారాబాద్ ప్రతినిధి జూన్ 30 (ప్రజాబలం)**

**వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి 45వ ఉరుస్ ఏ షరీఫ్ హజ్రత్ సయ్యద్ పటేల్ జాతరపండుగలో దర్గా వద్ద విందు ఏర్పాటుచేసిన గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్ సయ్యద్ పటేల్ కుబుల్ మా కుటుంబాన్ని ఆశీర్వదించి గ్రామానికి ప్రథమ పౌరుడిగా ప్రజలకు సేవ చేసే భాగ్యం ఇచ్చినందుకు శిరస్సు వంచి సలాం తెలుపుతున్నాను అని తెలిపారు ఈరోజు జాతర పండుగలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ప్రేమ పూర్వకంగా విందు ఏర్పాటుచేసిన గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్ కి సయ్యద్ పటేల్ కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు సయ్యద్ పటేల్ ఆశీర్వాదములు సర్పంచ్ మధు గురామేశ్వర్ పై మరియు వారి కుటుంబం పై రక్తసంబంధికులపై బంధుమిత్రులపై శ్రేయోభిలాషులపై స్నేహితులపై ఈ గ్రామం పై సదా కాలం సయ్యద్ పటేల్ ఆశీర్వాదములు కురిపించాలని సయ్యద్ పటేల్ కమిటీ తరపున దేవునికి ప్రార్ధన లో తెలిపాము అని తెలిపారు ముఖ్యంగా గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్ గ్రామ ప్రజలతో ఒక సహోదరుడి లాగా ఆత్మీయుడి లాగా ఎంతో ప్రేమగా అభిమానంగా పలకరించే మంచి మనసున్న మావూరి సర్పంచ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజాసేవలో అనేక పదవులు వారికి దేవుడు దయచేయాలని సయ్యద్ పటేల్ కమిటీ తరఫున పెద్దలు మరియు మహమ్మద్ సలీమో ద్దీన్, మహమ్మద్ గౌసో ద్దీన్, మహమ్మద్ జాఫర్, మహమ్మద్ జావిద్, మహమ్మద్ జాకీర్, మరియు పెద్దలు సుభాష్ యాదవ్, దయాకర్, వసంత్ కుమార్, రా చ య్య, భరత్ కుమార్, శివ, మారుతి, గ్రామ పెద్దలు కమిటీ పెద్దలు యువకులు గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ జాతర కార్యక్రమంలో పాల్గొన్న టు సంతోషం వ్యక్తపరిచారు



# రామగుండం రాజకీయ క్షేత్రంలో మళ్ళీ రాజ్' ఠాకూర్ దే హవా.?

## మళ్ళీ ఎమ్మెల్యే గా గెలిచేది రాజ్ ఠాగూరే..!

## మారుతున్న సమీకరణాలు.!

**పెద్దపల్లి, జూన్ 30, ప్రజాబలం ప్రతినిధి :**

రామగుండం నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్యే కోరుకంటి రాజ్ ఠాకూర్ పేరు మార్మోగుతోంది. వచ్చే ఎన్నికల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా ఆయన చేసిన అభివృద్ధి పనులు మరియు ప్రజలతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలే తన గెలుపును ఖాయం చేస్తాయని మద్దతుదారులు బలంగా నమ్ముతున్నారు.



= అభివృద్ధి పనులే ప్రధాన అస్త్రం..

గత కొంతకాలంగా రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన, ప్రధాన రహదారుల విస్తరణ మరియు పేదలకు అందిన సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే గా రాజ్ ఠాకూర్ విజయానికి సోపానాలుగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా యువతలో ఆయనకు ఉన్న క్రేజ్ మరియు స్థానిక సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చొరవ ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

= వ్యతిరేక పవనాలను అధిగమిస్తారా..?

ప్రతిపక్షాలు నియోజకవర్గంలోని పలు సమస్యలను తెరపైకి తెస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కే అనుకూలంగా ఉన్నాయని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. గడప గడపకు రాజ్ ఠాకూర్ అనే నినాదంతో అధికార పార్టీ కేడర్ ఇప్పటికే గ్రామ గ్రామాన పట్టణంలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. రామగుండం లో మళ్ళీ గెలిచేది ఎమ్మెల్యే రాజ్ ఠాకూరే అంటూ కార్యకర్తలు సోషల్ మీడియాలోనూ, బహిరంగ వేదికలపైనా గట్టిగా చెప్పుతున్నారు. రాజకీయ విశ్లేషణ రామగుండం లాంటి పారిశ్రామిక ప్రాంతంలో ఓటర్ల నాడిని పట్టుకోవడం కష్టంతో కూడుకున్న పని, అయినప్పటికీ, స్థానిక అభివృద్ధిని నమ్ముకున్న రాజ్ ఠాకూర్ తన పట్టును నిలబెట్టుకుంటారా లేక ప్రత్యర్థులు ఏమైనా కొత్త వ్యూహాలతో ఆయనను ఇబ్బందుల్లోకి నెడతారా అన్నది వేచి చూడాలి. ప్రస్తుతం మాత్రం రామగుండం రాజకీయాలు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చుట్టూనే తిరుగుతున్నాయి.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఇఆర్ఒ శ్రీమతి సరితారెడ్డి

హైదరాబాద్, జూన్ 30 : రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు కార్యదర్శి వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఎఎస్ మంగళవారం కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం, చార్మినార్ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఇఆర్ఒ శ్రీమతి సరితారెడ్డితో కలిసి పర్యవేక్షించారు.

బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకున్న అపోహలపై వారికి నివృత్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశాలను , ఆవశ్యకతలపై ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ సిఇఒ మాట్లాడుతూ 'సర్' ప్రక్రియ కేవలం ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ఓటర్లందరికి ఓటుహక్కు కల్పించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం అని అన్నారు. సర్ ప్రక్రియపై ప్రజలు ఆందోళన చేందాల్సిన అవసరం లేదని, ఇది పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బిఎల్ఒలు, సూపర్ వైజర్లు సహకరించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఫారాలను తప్పనిసరిగా బిఎల్ఒలకు అందజేసిన వారి పేర్లే ఓటర్ జబితాలో చేర్చడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# అమరావతిలో రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు

విజయవాడ, జూన్ 30 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లీ అద్భుతమైన పూర్వవైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణ పనులను దాదాపు రూ. 48 వేల కోట్లతో వేగవంతం చేయడం, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల విడుదల వంటి సానుకూల పరిణామాలు మార్కెట్‌కు కొత్త బూస్ట్ ఇచ్చాయి. రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు ప్రస్తుతం రికార్డు స్థాయిలో ఊపందుకున్నాయి.రాజధాని కోర్ ఏరియా పరిధిలోకి వచ్చే తుళ్లూరు, మంగళగిరి, మందడం, వెలగపూడి పరిసర ప్రాంతాల్లోని భూములకు ఇప్పుడు ఇన్వెస్టర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. ఒకప్పుడు వెలవెలబోయిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పుడు కొనుగోలుదారులు, రియల్టర్ల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో నిత్యం హడావుడిగా మారుతున్నాయి. ముఖ్యంగా తుళ్లూరు పరిసరాల్లో ఐదేళ్ల క్రితం చదరపు గజం రూ. 12,000 నుంచి రూ. 15,000 పలికిన సీఆర్డీయే ప్లాట్ల ధరలు, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి గజం రూ. 35,000 నుండి ఏకంగా రూ. 55,000 మార్కును తాకాయి. పక్కా లీగల్ క్లియరెన్స్, ప్రభుత్వ గుర్తింపు ఉండటంతో హైదరాబాద్, బెంగళూరు సహా ఎన్ఆర్ఐ ఇన్వెస్టర్లు ఇక్కడి ప్లాట్లను కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు.రాజధాని కోసం నాడు భూములిచ్చిన రైతులకు సీఆర్డీయే ఇటీవలే వీధిపోట్లు, వాస్తు లోపాలు లేని ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేసింది. ల్యాండ్ పూలింగ్ ప్లాట్ల తొలి విడత రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఎటువంటి ఫీజు వసూలు చేయకపోవడంతో రైతులు వేగంగా ప్రక్రియ ముగిస్తున్నారు. అలా రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్లను సొంత అవసరాల కోసం, ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రైతులు ఓపెన్ మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో క్రయవిక్రయాల సర్కిల్ వేగంగా తిరుగుతోంది. టైటిల్ పక్కాగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో ఎలాంటి లీగల్ రిస్క్ లేని ఈ ప్లాట్లను కొనేందుకు బయ్యర్లు ఎగబడుతున్నారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన, విచిత్రమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సొంత యువత భవిష్యత్తు కోసం, పక్క రాష్ట్రాల రాజధానులపై ఆధారపడే అవసరం లేకుండా ప్రభుత్వం ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తున్న సొంత రాజధాని అమరావతిపై.. సొంత రాష్ట్రానికి చెందిన వారే కుట్రలు చేయడం, దాన్ని కొంతమంది సమర్థించడం నవ్యాంధ్రకు పట్టిన పెద్ద దౌర్భాగ్యం. ఈ వైఖరి ఎలా ఉందంటే.. "నా కన్ను పోయినా పర్వాలేదు.. ఎదుటివారికి శకునం కాకూడదు" అన్న చందంగా, మన కొంపను మనమే తగులబెట్టుకున్నట్లు ఉంది.

"వ్యక్తిగతంగా మాకు ఎలాంటి లాభం లేదు కాబట్టి, అమరావతితో మాకేం పని?" అని భావించే కొంతమంది అమాయకులను, స్వార్థపరులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దాని అనుకూల శక్తులు కుట్రలకు తెరలేపుతున్నాయిఐదేళ్ల కాలంలో జగన్ మోహన్ రెడ్డి అమరావతిని పూర్తిగా పాడుబెట్టి, ఒక అడవిలా మార్చేసిన వైనాన్ని రాష్ట్రం చూసింది.

ఆ 'జంగిల్' క్లియర్ చేయడానికే కొత్త ప్రభుత్వానికి దాదాపు ఆరు నెలల కాలం పట్టిందంటే విధ్వంసం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఆ అవరోధాలన్నింటినీ దాటుకుని, గత ఏడాదిన్నర కాలంగా శ్రమించి రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కించిన తరుణంలో.. ఇప్పుడు మళ్లీ బెంగళూరు వేదికగా కుట్రల పర్వం ప్రారంభం కావడం ఘోరం. రాజధాని అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన భూముల వ్యవహారం కాదు. అది కోట్లాది మంది ఆంధ్రుల ఆత్మగౌరవం, రాబోయే తరాల ఉపాధి కేంద్రం. ఇటువంటి మహోన్నత ప్రాజెక్టును రాజకీయ కక్ష సాధింపుల కోసం దెబ్బతీయాలని చూడటం రాష్ట్ర ద్రోహమే అవుతుంది.

# రెండు ఎమ్మెల్సీ సీట్లకు 10 మంది పోటీ

విజయవాడ, జూన్ 30 కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల సందడి ముగిసిన వెంటనే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసు మొదలైంది. వచ్చేనెలలో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ ఇద్దరూ గవర్నర్ కోటాలో ఎంపికైన వారే కావడంతో ఆ రెండు స్థానాలను అధికార కూటమి దక్కించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే చాన్స్ రావడంతో కూటమి నేతలు ఎవరికి చాన్స్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. రెండేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న పలువురు నేతలు ఈ సారైనా అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందా? లేక ఈ సారి కూడా 'సారీ' అంటూ చేతులు దులుపుకుంటుందా? అని టెన్షన్ పడుతున్నారు.వచ్చేనెల 27తో శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుందని శాసన మండలి రికార్డులు ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ రెండుస్థానాల భర్తీకి జులైలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. జూన్ లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. కానీ, రకరకాల సమీకరణాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ నలుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సమయంలో పలువురు ఆశావహులకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై వారు ఆశ పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో గత ఎన్నికల సమయంలో సీట్లు కోల్పోయిన త్యాగరాజులే ఎక్కువగా ఉన్నారు. ఇలా ఎమ్మెల్సీ పదవులు కోరుకుంటున్న వారిలో టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా మాజీ మంత్రి, సీనియర్ నేత దేవినేని ఉమాతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, బుద్ధా వెంకన్న, వంగవీటి రాధాకృష్ణ, మహాసేన రాజేశ్ వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేస్తున్నారు.సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కోసం టికెట్ వదులుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో పార్టీ కేడర్ కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తోందని అంటున్నారు. తాజాగా ఆయనను నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతల నుంచి కూడా తప్పించారు. దీంతో వర్మ త్యాగం నిష్ఫలం అయిందని అసంతృప్తి కేడర్ లో వ్యక్తమవుతోందని అంటున్నారు. అయితే వర్మకు తగిన న్యాయం చేయాలని ముఖ్య నేతలు ఇద్దరూ భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఈ సారి ఎమ్మెల్సీ చాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.నిందితుడికి మరణ దండన ఖాయం చేసిన కోర్టు మరోవైపు మైలవరం సీటు వదులుకున్న దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ సీటును త్యాగం చేసిన బుద్ధా వెంకన్న, పి.గన్నవరం నుంచి పోటీకి అవకాశం దక్కినా, చివరి నిమిషంలో అధిష్టానం సూచనతో వెనక్కి తగ్గిన మహాసేన రాజేశ్ కూడా ఎమ్మెల్సీ ఆశావహులుగా గట్టి పోటీ ఇస్తున్నారని చెబుతున్నారు. ఇక పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పేరు కూడా చాలాసార్లు తెరపైకి రావడం, ఆ తర్వాత మరుగున పడిపోవడం జరుగుతోందని చెబుతున్నారు. దీంతో ఆయన పేరు ఈ సారి అయినా పరిశీలిస్తారా? లేదా? అన్నది చూడాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం కాపు సామాజిక వర్గం కేంద్రంగా రాజకీయం నడుస్తున్ననేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రాధా పేరు పరిశీలించే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి మరో నెల రోజుల్లో భర్తీ అయ్యే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు కూటమిలో ఆసక్తికర రాజకీయానికి తెరతీశాయని అంటున్నారు. ఈ విషయంలో ప్రధాన నేతలు ఇద్దరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదే ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు

# బెజవాడలోఅన్నదమ్ముల మధ్య సవాల్

విజయవాడ, జూన్ 30 విజయవాడలో అన్నా దమ్ముల రాజకీయ సమరం జోరుగా సాగుతోంది. ఒకరు ఎంపీగా ఉన్నారు. మరొకరు మాజీ ఎంపీ. ఈ ఇద్దరి మధ్యన చిచ్చు రాజుకుంది. ఎత్తులు పై ఎత్తులతో అన్నదమ్ముల పాలిటిక్స్ సాగుతోంది. తాజాగా చూస్తే కేశినేని నాని ఎంపీ చిన్ని మీద ఏకంగా భూకబ్జా ఆరోపణలతో అతి పెద్ద బాంబునే వేశారు. కేశినేని చిన్ని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారంటూ కేశినేని నాని గట్టిగానే టార్గెట్ చేశారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిందివిజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ దగ్గరలోని షంషిగూడలో 112.72 ఎకరాల ప్రభుత్వ భూమిని భారీగా కబ్జా చేసేందుకు ప్రయత్నించారని కేశినేని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసారి ఆయన నేరుగా తెలంగాణా ముఖ్యమంత్రినే మధ్యలోకి తీసుకుని వచ్చారు. తాను ఈ భూకబ్జా యత్నం విషయంలో రేవంత్ రెడ్డికే బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. ఈ భూమిని నిజానికి టీజీ ఐఐసీ ఐటీ పార్క్ కోసం కేటాయించింది అని నాని పేర్కొన్నారు. అయితే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆయనకు సంబంధించిన సంస్థలు అయితే ఒక మోసపూరితమైన న్యాయపరమైన ఒప్పందం ద్వారా ఆ భూమిని అక్రమంగా తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని నాని విమర్శించారు.ఇక ఇది పక్కాగా ప్రభుత్వం భూమి అని ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు ఎలాంటి యాజమాన్యం హక్కులు లేనే లేవని ఆ జిల్లా కలెక్టర్ కూడా సమర్పించిన అఫిడవిట్ లో స్పష్టం చేసారు అని నాని తెలిపారు. అందువల్ల ఈ ఆరోపితమైన ఆక్రమణను అడ్డుకోవాలని ఆయన కోరారు. అంతే కాదు ఇందులో ఎవరి ప్రమేయం ఉందో వారి మీద క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డికి డైరెక్ట్ గానే వినతి చేసారు. అంతే కాదు ఒక ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో హైడ్రా అలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ కూడా జోక్యం చేసుకోవాలని కూడా కేశినేని నాని కోరడం విశేషం.కేశినేని నాని ఈ ఆరోపణలు చేస్తూ ఊరుకోలేదు. తన సోషల్ మీడియా ద్వారా చేసిన ఆ ఆరోపణలతో కూడిన ట్వీట్ ని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా అగ్ర నేతలు అందరికీ ట్యాగ్ చేయడం విశేషం.

# అలా ముగిసిన శ్రీ లక్ష్మి ముగింపు

విజయవాడ, జూన్ 30 సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి మంగళవారం రిటైర్ అయ్యారు. ఈ నెల 25న ఆమెకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రిటైర్మెంటుకు ఐదు రోజుల ముందు పోస్టింగ్ ఇచ్చినా, వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో శ్రీలక్ష్మి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో ఒక రోజు బాధ్యతలు తీసుకోవడానికి సరిపోగా, రెండో రోజు రిటైర్మెంటు ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ విధంగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టులో రిటైర్ అవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో ఉన్న సంబంధాలు కారణంగా ప్రభుత్వం శ్రీలక్ష్మిని రెండేళ్లుగా వెయిటింగులో పెట్టిందని అంటున్నారు. ఇక రిటైర్మెంటును దృష్టిలో పెట్టుకుని న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా శ్రీలక్ష్మికి పోస్టింగు ఇచ్చిందని అంటున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి ఉద్యోగ జీవితానికి కూటమి ప్రభుత్వం విలక్షణమైన ముగింపు చెప్పిందని అంటున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి హోదాలో రిటైర్ కావాల్సిన శ్రీలక్ష్మి ఎటువంటి గుర్తింపు లేని పోస్టులో రిటైర్ కానుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 22 ఏళ్లకే సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కు వెళ్లిపోయారు. అయితే గత ప్రభుత్వంలో తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి మారిన శ్రీలక్ష్మి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరిగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగుకు నోచుకోక రెండేళ్లుగా వెయిటింగులో ఉన్నారు. అంతా సక్రమంగా ఉంటే ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కేంద్ర కేబినెట్ కార్యదర్శి ర్యాంకులో రిటైర్ కావాల్సివుందని అంటున్నారు. కానీ, ఆమెపై ఉన్న కేసుల కారణంగా ఆలిండియా సర్వీసుల్లోని అత్యున్నత పోస్టులకు అర్హత కోల్పోయారని వ్యాఖ్యానిస్తున్నారు.ఇక 1988లో సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి దాదాపు 38 ఏళ్లపాటు ఐఏఎస్ అధికారిణిగా వివిధ హోదాల్లో పనిచేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఓబుళాపురం మైనింగ్ స్కాంలో ఇరుక్కుని కెరీర్ లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఓబుళాపురం మైనింగ్ స్కాం నిందితుల జాబితాలో శ్రీలక్ష్మిని సీబీఐ చేర్చడంతో 2011లో అరెస్టు అయ్యారు. ఆ తర్వాత ఈ కేసు విషయమై న్యాయపోరాటం చేస్తూ పలుమార్పు జైలుకు వెళ్లడం, బెయిలుపై రావడం ద్వారా ఆమె కెరీర్ తీవ్ర ఇబ్బందుల్లో పడిపోయిందని అంటున్నారు. ఈ వ్యవహారం వల్లే పెద్ద పోస్టింగులకు నోచుకోలేకపోయారని అంటున్నారు. చివరికి రిటైర్మెంట్ సమయంలోనూ ఓబుళాపురం మైనింగ్ స్కాం భూతంలా వెంటాడడంతో సాధారణ పరిపాలన శాఖలో జీపీఎం అండ్ ఏఆర్ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సరిపెట్టుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ గా కెరీర్ ప్రారంభించిన శ్రీలక్ష్మి.. ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ ద్వారా అత్యంత వివాదాస్పద అధికారిణిగా ముద్రపడ్డారని అంటున్నారు. అంతేకాకుండా ఆ కేసు ద్వారా ప్రస్తుత విపక్ష నేతలతో ఆమెకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రభుత్వానికి టార్గెట్ గా మారారని చెబుతున్నారు. ఈ కారణంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఆమెను పక్కన పెట్టారని, చివరికి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టుతో పదవీ విరమణకు అవకాశం కల్పించారని చెబుతున్నారు. దీంతో అఖిల భారత సర్వీసు అధికారుల్లో శ్రీలక్ష్మి ఎపిసోడ్ హాట్ టాపిక్ గా మారింది. ఎన్నో వివాదాలు, మరెన్నో రాజకీయాల మధ్య సాగిన శ్రీలక్ష్మి ఉద్యోగ ప్రస్థానం ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులు ఒక పాఠంగా నేర్చుకోవాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# పెన్షన్ ల నుంచి ప్రాజెక్ట్ ల వరకు..

తిరుపతి, జూన్ 30 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జూలై 1 నుంచి జూలై 5 వరకు పలు జిల్లాల్లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. ఐదు రోజుల పాటు సాగనున్న ఈ పర్యటనలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు నేరుగా ప్రజల్లోకి సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా జూలై 1వ తేదీన సీఎం చంద్రబాబు నెల్లూరు జిల్లా చిలకపూరు మండలంలో పర్యటించనున్నారు.అక్కడ స్వయంగా లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. అదే రోజు తిరుపతి జిల్లా శ్రీసిటీలో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం 'హీరో మోటో కార్ప్' సంస్థ రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించిన 'గ్లోబల్ పార్ట్స్ సెంటర్'కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జూలై 2న తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో జరిగే వీబీజీ రాంజీ కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అనంతరం తిరుపతిలోనే నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఊఆఖ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్'లో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.ఇక జూలై 3వ తేదీన రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్టాత్మక 'రాయలసీమ స్టీల్ ప్లాంట్' పనులను కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు. కడప పర్యటన ముగించుకుని జూలై 3వ తేదీనే సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం చేరుకుంటారు. జూలై 3 నుంచి జూలై 5వ తేదీ వరకు వరుసగా మూడు రోజుల పాటు కుప్పంలోనే ఆయన బస చేయనున్నారు. ఈ మూడు రోజుల్లో నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు స్థానిక నేతలు, ప్రజలతో నేరుగా ముఖాముఖి కానున్నారు.

# పీవీ సునీల్ రిటైర్మెంట్ అనుహ్యాం..

విజయవాడ, జూన్ 30 సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రీకృతంగా మారిన సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏపీ సీఐడీ మాజీ అడిషనల్ డీజీ పీవీ సునీల్‌కుమార్‌కు కూటమి ప్రభుత్వం ఊహించని గట్టి షాక్ ఇచ్చింది. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయనను జూన్ 30న "సేవల నుంచి కేవలం రిలీవ్" చేస్తూ అత్యంత సంచలన ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. ఆల్ ఇండియా సర్వీస్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ఐపీఎస్ వర్గాలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఎలాంటి మచ్చ లేకుండా తన సుదీర్ఘ సర్వీసును ముగిస్తే, ప్రభుత్వం పూర్తి రిటైర్మెంట్ ప్రయోజనాలతో గౌరవంగా పంపిస్తుంది. కానీ, సునీల్‌కుమార్ వ్యవహారంలో సర్కార్ చట్టబద్ధమైన వీడ్కోలుకు బదులు పోలీస్ ఎస్కేప్ రూట్ ను క్లోజ్ చేసే వ్యూహాన్ని ఎంచుకుంది. ఆయనపై ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, ల్యాండ్ గ్రాబింగ్, ఫోర్జరీ మరియు క్రిమినల్ కేసులపై సాగుతున్న విచారణలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేందుకే ఈ రిలీవింగ్ అస్త్రాన్ని ప్రయోగించింది. ఆయన విధుల్లోంచి తప్పుకున్నప్పటికీ, నిందితుడిగా ఆయనపై ఉన్న దర్యాప్తు సంస్థల విచారణలు సివిల్ వ్యక్తిగా యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ తాజా ఉత్తర్వుల వల్ల పీవీ సునీల్‌కుమార్‌కు తక్షణమే భారీ ఆర్థిక, సాంకేతిక షాక్‌లు తగలనున్నాయి. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ ప్రకారం.. ఇలా విచారణలు పెండింగ్‌లో ఉంచి రిలీవ్ చేసినప్పుడు, సదరు అధికారికి అందాల్సిన పూర్తి స్థాయి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా నిలిచిపోతాయి. ఆయనకు కేవలం బతుకుదెరువుకు అవసరమైన తాత్కాలిక ప్రొవిజనల్ పెన్షన్ మాత్రమే అందుతుంది. రేపు విచారణ ముగిసి కోర్టులో కానీ, శాఖాపరంగా కానీ ఆయన దోషిగా తేలితే.. ఈ పెన్షన్‌ను కూడా శాశ్వతంగా రద్దు చేసే లేదా భారీగా కోత విధించే సర్వాధికారాలు ప్రభుత్వానికి లీగల్‌గా సంక్రమిస్తాయి.ఏపీ ప్రభుత్వం తదుపరి కఠిన చర్యల కోసం రాష్ట్ర డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 30న సాయంత్రం ఆయన ఆఫీస్ నుంచి రిలీవ్ అయిన వెంటనే, ఆయనపై ఉన్న క్రిమినల్ కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని, చట్టపరమైన చర్యల కోసం అవసరమైన చార్జ్‌షీట్లను కోర్టుల్లో దాఖలు చేయాలని సూచించింది. గత వైసీపీ హయాంలో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సునీల్ కుమార్..పదవీ విరమణతోనైనా కేసుల నుంచి విముక్తి లభిస్తుందని ఆశించినా, కూటమి ప్రభుత్వం నిబంధనల ఉచ్చుతో వేసిన పక్కా స్కెచ్‌తో ఆయన భవిష్యత్తు ఇప్పుడు పూర్తిగా అంధకారంలో పడిపోయింది.

## వారణాసి..ఇక ఓన్లీ వెజ్

లక్నో, జూన్ 20, (న్యూస్ పల్స్) ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది. వారణాసి నగర మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది. ఈ మేరకు మేయర్ అశోక్ తివారీ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో దీపావళిలోపు విడతల వారీగా నగర శివార్లకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ దుకాణాలను రామ్నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీనగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్ రాష్ట్రంలోని 'పాలితానా' గుర్తింపు పొందింది. ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్లు విక్రయాలపై నిషేధం అమల్లోఉంది. వారణాసిలో హిందువులు 72శాతం, ముస్లింలు 27శాతం ఉన్నారనేఅంచనాలున్నాయి.తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నగర పరిశుభ్రత, పుణ్యక్షేత్రం ప్రత్యేకత దృష్ట్యా స్వాగతిస్తుండగా.. మరికొందరు దుకాణాలు దూర ప్రాంతాలకు మారితే వినియోగదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం మాంసాహారాన్ని నిషేధించడం కాదని.. కేవలం దుకాణాలను వేరే ప్రాంతానికి తరలించి.. అక్కడ వ్యాపారాలు చేసుకునేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

# వైసీపీ టార్గెట్ పోలీస్

గుంటూరు, జూన్ 30,ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తాజా రాజకీయ వ్యూహాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో తమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ప్రధాన ప్రతిపక్షం, శాంతిభద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థనే తమ ప్రధాన ప్రత్యర్థిగా మార్చుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని ఒక పోలీసు అధికారిని ఉద్దేశించి “మూడేళ్ల తర్వాత నీ సంగతి చూస్తానురా ” అంటూ బహిరంగంగానే హెచ్చరించడం, మరోవైపు సాయికృష్ణ ఇష్యూను సాకుగా చూపిస్తూ మొత్తం పోలీసు శాఖనే నిందితులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ఇందులో భాగమే.

రాజకీయ ప్రయోజనాల కోసం పదే పదే పోలీసులపై ఇలాంటి ఒత్తిళ్లు తీసుకురావడం పక్కా ప్రణాళిక ప్రకారమే జరుగుతోందనే అనుమానాలు బలపడుతున్నాయి.వైసీపీ ఇలా పద్ధతి ప్రకారం పోలీసుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూడటం వెనుక ఒక లోతైన వ్యూహం దాగి ఉంది. శాంతిభద్రతలను పర్యవేక్షించే వ్యవస్థను మానసికంగా భయపెట్టడం ద్వారా, క్షేత్రస్థాయిలో తమ అరాచక రాజకీయాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగించవచ్చనేది ఆ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది. తాము అధికారంలో లేనప్పటికీ.. రేపు రాబోయే రోజుల్లో తామే వస్తామంటూ హెచ్చరికలు జారీ చేయడం ద్వారా, విధుల్లో ఉన్న అధికారులు చట్టప్రకారం కఠిన నిర్ణయాలు తీసుకోకుండా వెనకడుగు వేసేలా ‘ఫియర్ సైకాలజీ’ని ప్రయోగిస్తున్నారు.ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడకే ప్రమాదకరంగా మారుతోంది. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులపైనే భౌతిక దాడులకు దిగడం, లేదా వారిని వ్యక్తిగతంగా, సామాజికంగా బద్నాం చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న కానిస్టేబుల్స్ నుంచి ఉన్నతాధికారుల వరకు తీవ్ర అసంతృప్తి నెలకొనే అవకాశం ఉంది. పోలీసుల రక్షణకే ముప్పు వాటిల్లితే, రేపు సామాన్య ప్రజల భద్రతకు ఎవరు గ్యారెంటీ ఇస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్షం చేస్తున్న ఈ వ్యూహాత్మక దాడులను కేవలం ఒక రాజకీయ ప్రక్రియగా వదిలేస్తే, అది భవిష్యత్తులో మరింత శాంతిభద్రతల క్షీణతకు కారణమవుతుందిఈ అరాచక, బెదిరింపు రాజకీయాలను నిర్వీర్యం చేయాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసు యంత్రాంగంపైనే ఉంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, విధులకు ఆటంకం కలిగిస్తూ పోలీసుల స్థైర్యంపై దాడి చేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా, చట్టాన్ని ఉల్లంఘించే నాయకులకు చట్టపరంగానే సరైన ‘షాక్ ట్రీట్‌మెంట్’ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని, పోలీసుల ఆత్మస్థైర్యం చెక్కుచెదరకుండా నిలబడుతుందని పౌర సమాజం గట్టిగా ఆకాంక్షిస్తోంది.

మైండ్ గేమ్

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ అన్ని ప్రధాన విషయాల్లోనూ అధికార పార్టీని ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తుంది. ప్రజలకు అవసరమైన అంశాలతో పాటు సామాజికపరమైన అంశాలను కూడా తమకు అనుకూలంగా మలచుకుంటూ, అధికార పార్టీని ఇబ్బందులపాలు చేయడానికి ప్రయత్నిస్తుంది. వైసీపీ ట్రాప్ లో కొంత వరకూ టీడీపీ పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆ ఒక్కటి చాలదూ.. అన్నట్లు ఇక వైసీపీ నాయకత్వం వేగం పెంచింది. పాలిటిక్స్ లో హీట్ తగ్గకుండా ప్రతి రోజూ వార్తల్లో నిలిచి ఉండేలా చూసుకుంటూ అధికార పార్టీని ఇబ్బందుల పాలు చేయడానికి వేస్తున్న ప్లాన్ ఎంత వరకూ ఫలిస్తుందో తెలియదు కానీ, కొంత వరకూ సక్సెస్ అయినట్లే కనిపిస్తుంది... విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ వైసీపీ వెంటనే రియాక్ట్ అయి బాధిత కుటుంబాన్ని జగన్ పరామర్శించిన తర్వాతనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, తొలుత విచారణకు ఆదేశించి, ఆ తర్వాత సిట్ ను నియమించిందని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటుంది. నిజానికి అప్పటి వరకూ విజయవాడలోని టీడీపీ నేతలు కూడా దీనిని పట్టించుకోలేదు. కానీ ప్రధాన సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీ ప్రయత్నించడంతో తాము వెనకబడి పోతామన్న భయంతో టీడీపీ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్న కామెంట్స్ సొంత పార్టీ సోషల్ మీడియాలోనే వినిపిస్తున్నాయి. దీనిని పూర్తిగా కొట్టిపారేయలేని పరిస్థితి. మరొకవైపు నిన్న వైసీపీ నేతలు రాజధాని అమరావతి పర్యటన పెట్టుకోవడం కూడా అందులో భాగమే. అమరావతికి వెళ్లేందుకు వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలను టీడీపీ నేతలు అడ్డుకుంటారని తెలుసు. కానీ కావాలనే వైసీపీ నేతలు అమరావతి పర్యటనకు బయలుదేరారు. వారు ఊహించినట్లుగానే టీడీపీ నేతలు దాడికి దిగారు. దీంతో కానిస్టేబుల్ కు గాయాలయ్యాయి. అంతే కాదు.. తమ పార్టీకి కావాల్సిన మైలేజీ లభించిందని వైసీపీ తన రాజధాని ప్రయాణాన్ని మానుకుంది. ఇలా అనేక విషయాల్లో వైసీపీ అధికార పార్టీని ట్రాప్ లో లాగడం, తమ వల్లనే ఇదంతా జరిగిందని ప్రచారం చేసుకుంటుండటంతో కూటమి ప్రభుత్వానికి మింగుడుపడటం లేదు. మరి వైసీపీ ఈ నయా పాలిటిక్స్ నుంచి అధికార పార్టీ ఎలా బయటపడుతుందన్నది చూడాలి.

ఇప్పటికైతే వైసీపీ కొంత మేర ఎఫెన్స్ లో ఉందనే చెప్పాలి.

# కేబినెట్ ఫైట్... శాఖల మార్పులు తప్పవా

న్యూఢిల్లీ,జూన్ 30 లంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోం ది.ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది.కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు.ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం.

## నిర్మలమ్మ స్థానంలో శక్తికాంత్ దాస్

కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు.గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది.డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది.ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వులు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వెనెజువెలాలో మళ్లీ భూకంపం..

వెనెజువెలాలో 4.6 నుంచి 5.1 తీవ్రతతో మరోసారి భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్లను వదిలి వీధుల్లోనే ఆశ్రయం పొందారు. గత వారం సంభవించిన భారీ భూకంపం వల్ల దెబ్బతిన్న భవనాల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సరిగ్గా మూడు రోజుల క్రితం వెనెజువెలా ఉత్తర-మధ్య ప్రాంతాన్ని 39 సెకన్ల వ్యవధిలో 7.2, 7.5 తీవ్రతతో కూడిన రెండు అత్యంత శక్తివంతమైన జంట భూకంపాలు వణికించిన సంగతి తెలిసిందే.

# బుల్లెట్ ట్రైన్ సర్వే షురూ..

హైదరాబాద్, జూన్ 20, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు కారిడార్ల ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో తెలంగాణలోని రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్ జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి (గ్రౌండ్) సర్వే ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ కారిడార్ల మార్గాన్ని ఖరారు చేసేందుకు సర్వే బృందాలు క్లిష్టమైన కసరత్తును నిర్వహిస్తున్నాయి.ఈ సర్వేలో భాగంగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కురుమిద్ద, మేడిపల్లి, మంకీస్‌గూడెం, చింతపట్ల వంటి పలు గ్రామాల్లోని పొలాలు, ఖాళీ స్థలాలలో ఎరుపు, తెలుపు రంగులతో ప్రత్యేక మార్కింగ్‌ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. హైదరాబాద్-చెన్నై కారిడార్ శంషాబాద్, యాచారం మీదుగా నల్గొండ జిల్లా నాంపల్లి వైపు, అలాగే హైదరాబాద్-బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు.ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. అలాగే హైదరాబాద్-బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు.ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. ప్రస్తుతం జరుగుతున్న క్షేత్రస్థాయి గ్రౌండ్ సర్వే పూర్తిగా పూర్తయితే, ప్రాజెక్టుకు సంబంధించిన తుది ఎలైన్‌మెంట్, బుల్లెట్ రైలు స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే లొకేషన్లు, భవిష్యత్తులో అవసరమయ్యే భూసేకరణ పరిధిపై పూర్తి స్పష్టత రానుంది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 నుండి 3 గంటలకు తగ్గిపోనుంది.

# గ్రేటర్ లో గులాబీ రివర్స్ స్కెచ్

హైదరాబాద్, జూన్ 30 గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ -జీహెచ్ఎంసీ పరిధిలో ఎలాగైనా సరే మళ్లీ పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ గట్టిగా ట్రై చేస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్లపాటు పెద్దగా జనంలోకి రాని గులాబీ శ్రేణులు.. ఇప్పుడు మాత్రం రూట్ మార్చాయి. రోజువారీగా ప్రజల్లో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌లో కొత్త జోష్ నింపుతున్నారు.బీఆర్ఎస్ అగ్రనాయకత్వం జీహెచ్ఎంసీపై ఇంతలా ప్రత్యేక దృష్టి పెట్టడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఏకంగా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. దీనికి ఆనుకుని ఉన్న శివారు నియోజకవర్గాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 35 కి చేరుకుంటుంది. అంటే, రాష్ట్ర అధికార పీఠాన్ని శాసించడంలో దాదాపు మూడో వంతు బలం ఒక్క గ్రేటర్ పరిధిలోనే దాగి ఉందన్నమాట. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మాత్రం బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అదే ఊపును రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగించి, ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీని గనుక మట్టికరిపించగలిగితే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అని బీఆర్ఎస్ గట్టిగా భావిస్తోంది. ఇక్కడ సాధించే విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి గట్టి పునాది వేయవచ్చనేది కేటీఆర్ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది.గత కొన్ని రోజులుగా కేటీఆర్ హైదరాబాద్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. కేవలం పార్టీ కార్యాలయాలకే పరిమితం కాకుండా, నేరుగా నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ స్థానిక లీడర్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి సమీక్షల్లో అటు స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూనే, ఇటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన హైడ్రాపై పార్టీ శ్రేణులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను జనంలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్.. కేటీఆర్ దూకుడుతో ఇప్పుడు రూట్ మార్చింది. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు రోజూ జనంలో ఉండేందుకే స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రాధాన్యత ఇస్తున్నారు. గల్లీ గల్లీలో పర్యటిస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కేవలం కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందనే విషయాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నగరం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు.మొత్తానికి హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలు చూపించేందుకు కేటీఆర్ సిద్ధమయ్యారు. ఒకవైపు 24 నియోజకవర్గాల అండ, మరోవైపు కేటీఆర్ దూకుడుతో గ్రేటర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇక్కడ పట్టు నిలుపుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ బీఆర్ఎస్ హవా సృష్టించాలనే ‘రివర్స్ స్కెచ్’ ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి. కేటీఆర్ వ్యూహాత్మక కొట్లాట అధికార కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ పరిధిలో ఖచ్చితంగా పెద్ద సవాల్‌గా మారబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## హెచ్‌సీయూలో నిరవధిక సమ్మెకు దిగిన కాంట్రాక్ట్ కార్మికులు...

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (జనీఊ) లో కాంట్రాక్ట్ కార్మికులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని, కార్మిక హక్కుల కాలరాటోను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ పరిపాలనా విభాగం ఎదుట కార్మికులు నిరవధిక నిరసనను ప్రారంభించారు.హక్కులను కాలరాస్తున్న కొత్త కార్మిక చట్టాలు..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల (ఒజీఎనీబీతీ అనీటవబ) వల్ల తాము తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుతో తమ ఉద్యోగ భద్రత కరువైందని, కార్యాలయంలో రక్షణలు బలహీనపడ్డాయని వారు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పోరాడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను సైతం ఈ కొత్త చట్టాల సాకుతో అణచివేస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు.కొత్త కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం..ఇటీవలే వర్సిటీకి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ నియామకంతో పరిస్థితి మరింత జటిలంగా మారిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి..కొత్త కాంట్రాక్టర్ ఈ కార్మిక చట్టాల నిబంధనలను ఆసరాగా చేసుకుని, మాకున్న పాత హక్కులను, ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల పని ప్రదేశంలో పని ఒత్తిడి పెరగడమే కాకుండా, మా జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది.” అని ఒక కార్మిక ప్రతినిధి ఆరోపించారు.డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదువర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి, తమతో చర్చలు జరపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించే వరకు మరియు తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ నిరసనల నేపథ్యంలో యూనివర్సిటీలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో, పరిపాలనా విభాగం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించిన కార్మికులు

హైదరాబాద్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోచుకొని మంత్రి ఇంటి మీదకు దూసుకెళ్లారు. గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారుకనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి నివాసం వద్దకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

# మైలేజ్ కోసం కవిత ఆరాటం...



హైదరాబాద్, జూన్ 30 తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత, కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పేరిట సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, పార్టీని ప్రకటించినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజాదరణ లభించకపోవడం, క్యాడర్ ఆశించిన మేర యాక్టివ్ కాకపోవడంతో కవిత తన రాజకీయ వ్యూహాన్ని మార్చినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆమె టార్గెట్ చేయడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఏదైనా కొత్త పార్టీ ప్రాంతీయంగా నిలదొక్కుకోవాలంటే బలమైన లీడ్ లేదా సంచలనాల అవసరం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్యే ప్రధాన రాజకీయం నడుస్తోంది. ఈ తరుణంలో తన ఉనికిని చాటుకోవడానికి, నిరంతరం వార్తల్లో నిలిచేందుకు కవిత సరికొత్త పంథాను ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. అందులో భాగమే పవన్ కల్యాణ్ లక్ష్యంగా సాగుతున్న విమర్శలు.పవన్ కల్యాణ్ కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన మాస్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో. ఆయన్ను విమర్శిస్తే సహజంగానే అటు అభిమానులు, ఇటు జనసైనికులు సోషల్ మీడియా వేదికగానో, క్షేత్రస్థాయిలోనో గట్టిగా కౌంటర్ ఇస్తారు. ఈ వివాదం ద్వారా తన కొత్త పార్టీ 'టీఆర్ఎస్' పేరు జనంలోకి వెళ్తుందనేది కవిత ఆలోచనగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి కవిత చేస్తున్న వ్యాఖ్యలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. పవన్ కల్యాణ్ తెలంగాణలో రాజకీయాలు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇక్కడికి వస్తే తరిమికొడతామని కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన సినిమాలు చూసి ఆనందిస్తాం కానీ, రాజకీయంగా ఇక్కడ జోక్యం చేసుకుంటే సహించబోమంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా ఇడుపు కాయితం సినిమా చుట్టూ జరుగుతున్న వివాదంలోకి కూడా పవన్ కల్యాణ్‌ను అనవసరంగా లాగడం చర్చనీయాంశమైంది. ఆ సినిమా వివాదం వెనుక ఉన్న అర్థం, పరమార్థం పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసంటూ కవిత చేసిన కామెంట్స్, ఆమె కావాలనే వివాదాన్ని పెద్దది చేయాలని చూస్తున్నారనే వాదనకు తావిస్తోంది.రాజకీయాల్లో నెగెటివ్ పబ్లిసిటీ అయినా ఒక్కోసారి మైలేజ్ ఇస్తుందనేది కొందరి నమ్మకం. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా కవితకు వచ్చే లాభనష్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పవన్ అభిమానులు ఇచ్చే కౌంటర్ల వల్ల మీడియాలో, సోషల్ మీడియాలో కవిత పేరు, ఆమె కొత్త పార్టీ పేరు మార్మోగుతుంది. తద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి పార్టీ రీచ్ అవుతుంది. అయితే వ్యక్తిగత విమర్శలు, పొరుగు రాష్ట్ర నాయకుడిని టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో సీరియస్‌నెస్ తగ్గే ప్రమాదం ఉంది. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, పవన్ కల్యాణ్‌కు తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉండటం కవితకు మైనస్ కావచ్చు.మొత్తానికి, 'తెలంగాణ రక్షణ సేన'కు ఆశించినంత స్పందన రాకపోవడంతో, పవన్ కల్యాణ్ లాంటి పాపులర్ లీడర్‌ను ఢీకొట్టడం ద్వారా పొలిటికల్ మైలేజ్ సాధించాలనే కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఈ పవన్ కల్యాణ్ అస్త్రం కవిత కొత్త పార్టీకి ఎంతవరకు ఊపిరి పోస్తుందో, ఎలాంటి రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందో వేచి చూడాలి.

# కేబినెట్ విస్తరణకు బ్రేక్....

హైదరాబాద్, జూన్ 30 తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా హాట్ టాపిక్‌గా నడుస్తున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అగ్రనాయకత్వం, ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని సమీక్షలు జరిపినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న సంక్లిష్ట రాజకీయ సమీకరణాలు ఈ ప్రక్రియకు గట్టిగా మోకాలడ్డుతున్నాయి. ఉన్న సమస్యలకు తోడు కొత్త సమస్యలను కొనితెచ్చుకోవడం ఇష్టం లేక, కాంగ్రెస్ హైకమాండ్ ఈ కేబినెట్ విస్తరణ అంశాన్ని ప్రస్తుతానికి పూర్తిగా పక్కన పెట్టేసినట్లు తెలుస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌లో పైకి అంతా సజావుగానే ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. అంతర్గతంగా నడుస్తున్న వర్గ పోరాటం ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉందనేది నగ్నసత్యం. ముఖ్యంగా, రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తురాలైన ఏఐసీసీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఇప్పుడు పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్‌లో ఆమె రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంలో తెలంగాణకు చెందిన ఒక వర్గం నేతల పాత్ర ఉందన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. అధిష్టానానికి అత్యంత సన్నిహితురాలైన నేతకే రాష్ట్రంలోని సొంత పార్టీ వర్గం నుండి సరైన మద్దతు లభించలేదనే టాక్ రాహుల్ గాంధీని తీవ్ర అసంతృప్తికి గురిచేసినట్లు సమాచారం. ఈ ఒక్క ఘటనతో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ల మధ్య ఉన్న విభేదాలు ఏ స్థాయికి చేరాయో హైకమాండ్‌కు స్పష్టమైన అవగాహన వచ్చింది.నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ పెద్దలు కలిసి తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు చేయాలని ఒక పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. సరిగా పనిచేయని మంత్రులను కేబినెట్ నుండి తొలగించాలని, సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా కొత్తవారికి అవకాశం కల్పించాలని భావించారు. అసంతృప్త సీనియర్లను ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను సర్దాలని నిర్ణయించారు. కానీ, మీనాక్షి నటరాజన్ ఎపిసోడ్ రేపిన సెగలతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ తరుణంలో మంత్రివర్గంలో చెయ్యి పెడితే, పదవులు దక్కని అసంతృప్త నేతలు తిరుగుబాటు జెండా ఎగురవేసే ప్రమాదం ఉందని అధిష్టానం గ్రహించింది. అది కాస్తా ప్రభుత్వ స్థిరత్వానికే ఎసరు తెచ్చే అవకాశం ఉందన్న విశ్లేషణలతో పాత ప్లాన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, మరోవైపు పరిపాలనను ముందుకు తీసుకెళ్లాల్సిన కత్తిమీద సాము లాంటి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి ఎదుర్కొంటున్నారు. కేబినెట్ విస్తరణ చేపడితే.. ఆశావహుల సంఖ్య ఇక్కడ డజన్లలో ఉంది. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి సీనియర్లు, అలాగే ఇతర పార్టీల నుండి వలస వచ్చిన నేతలు మంత్రి పదవుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ తరుణంలో ఎవరికి ఇచ్చినా మరొకరు అసంతృప్తికి గురికావడం ఖాయం. అందుకే రేవంత్ రెడ్డి కూడా ఈ వివాదాన్ని తలకెత్తుకోవడం కంటే, "ఉన్న మంత్రి తగాదాలను మరింత రచ్చ చేయకుండా యథాతథ స్థితిని కొనసాగించడమే శ్రేయస్కరం" అనే ముగింపునకు వచ్చినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. మరింత సరైన సమయం వచ్చే వరకు వేచి చూడడమే రాజనీతి అని ఆయన భావిస్తున్నారు.తెలంగాణలో త్వరలోనే మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందనే ప్రచారానికి ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లే. ఒకవేళ అత్యవసరమై ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి వచ్చినా.. అది కేవలం నామమాత్రపు విస్తరణగానే ఉంటుంది తప్ప, ఎవరినీ మార్చే లేదా తొలగించే సాహసం హైకమాండ్ చేయకపోవచ్చు

# వరంగల్ కొత్త మాస్టర్ ప్లాన్

వరంగల్, జూన్ 30 గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో రాబోయే కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇన్వెస్టర్లలో ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. నగరాభివృద్ధి సంస్థ కుడా ప్రతిపాదిస్తున్న నూతన మాస్టర్ ప్లాన్ మార్పుల తాలూకు లీకేజీలు, ఊహాగానాలు మార్కెట్ వర్గాల్లో ఒక రకమైన ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా తుది ప్లాన్‌ను ప్రకటించక ముందే వేర్వేరు జోన్లపై వస్తున్న లీకేజీల వల్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది.ఈ తాజా పరిణామాలతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల కొనుగోళ్లు తాత్కాలికంగా మందగించాయి. వ్యవసాయ జోన్ ఎటు మారుతుంది? గ్రీన్ జోన్, కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్ల సరిహద్దులు ఎక్కడ ఖరారవుతాయి? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. ఏ ఒక్క జోన్ తారుమారైనా తాము పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి చిక్కుల్లో పడుతుందనే అయోమయంతో ఇన్వెస్టర్లు, అటు నాలా కన్వర్షన్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లు తమ కొత్త వెంచర్ల లాంచింగ్‌లను కొద్దిరోజుల పాటు హోల్డ్‌లో పెట్టారు.ఔటర్ పరిసరాల్లో ఈ విధమైన నిస్తేజం కనిపిస్తున్నప్పటికీ, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఏరియాల్లో మాత్రం స్థిరాస్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నగర నడిబొడ్డున , ఐఆర్ఆర్ కనెక్టివిటీ ఉన్న ప్రధాన లేఅవుట్లలో ఎలాంటి జోనింగ్ భయాలు లేకపోవడంతో గజం ధరలు యథాతథంగా ఉన్నాయి. పైగా, భవిష్యత్తులో మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే నగర కేంద్రంలో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందనే అంచనాతో ఇన్నర్ ఏరియాల్లో ఉన్న బిట్లను దక్కించుకోవడానికి కొందరు మదుపరులు ఇప్పటికీ ఆసక్తి చూపిస్తున్నారు.ఈ గందరగోళానికి తెరపడాలంటే ప్రభుత్వం త్వరితగతిన కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను అధికారికంగా విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని స్థానిక రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. ప్లాన్‌పై పూర్తి స్థాయి పారదర్శకత వస్తేనే గ్రేటర్ వరంగల్ పరిధిలో మళ్లీ ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని, అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడి మార్కెట్‌లో నమ్మకం పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.

## సామర్లకోటలో విషాదం.. ఒకరి మృతి

సామర్లకోట కెనాల్ రహదారిలో మంగళవారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతిచెందారు. కోల్కాతా నుంచి కాకినాడకు మోటార్ సైకిల్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీని, ఎదురుగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టిందని ట్రాఫిక్ ాఎ అడపా గరగారావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మరో లారీ డ్రైవర్ను పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కేబినెట్ లో మరో మంత్రి

హైదరాబాద్, జూన్ 30 తెలంగాణపై భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో మరొకరికి అవకాశం లభిస్తుందా, లేక ప్రస్తుతం ఉన్న ఇద్దరితోనే సరిపెడతారా అనే అంశంపై రాష్ట్ర బీజేపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ మార్పులు, చేర్పుల ప్రచారం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో తమకు అనుకూలంగా సమీకరణాలను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఊహించని విధంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది కమలం పార్టీ. దీనికి అదనంగా లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత తెలంగాణలోనే పార్టీ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని బీజేపీ జాతీయ నాయకత్వం బలంగా విశ్వసిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా కేంద్ర మంత్రులు, జాతీయ నేతలు రాష్ట్రంలో నిరంతరం పర్యటిస్తున్నారు. ఈ తరుణంలో, రాష్ట్రంలోని ముఖ్య నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను సమూలంగా పరిష్కరించి, కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి మరో మంత్రి పదవిని కేటాయించడం దోహదపడుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.తెలంగాణ నుంచి ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఉండగా, రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా మూడో వ్యక్తికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యతను సాధించాలని అధిష్ఠానం యోచిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ప్రధానంగా ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ధర్మపురి అర్వింద్, జి.నగేశ్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.అయితే., ఈటల రాజేందర్, డీకే అరుణ రేసులో ముందు వరుసలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ మంత్రివర్గంలో ఉన్నప్పటికీ, బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌కు అవకాశం కల్పిస్తే రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద ఎత్తున కలిసి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సైతం ఈసారి గట్టి ఆశలతో ఉన్నారు. ఈ విస్తరణలో మహిళలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండటం, పైగా ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ గట్టి పోటీని తట్టుకుని ఆమె విజయం సాధించడంతో ఆమె పేరును అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.అయితే, డీకే అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక వర్గం నుంచే ఇప్పటికే కిషన్ రెడ్డి క్యాబినెట్ మంత్రిగా అత్యంత కీలక బాధ్యతల్లో ఉన్నారు. అలాగే శాసనసభలో పార్టీ పక్ష నేత కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఒకే సమీకరణం నుంచి మరో వ్యక్తిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓసీ, బీసీ వర్గాలకు కేంద్రంలో చోటు దక్కినందున, గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్‌కు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం కూడా ఊపందుకుంది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం తనదైన శైలిలో గట్టి నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు.మొత్తంమీద, తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుతమున్న మంత్రులలో ఎటువంటి మార్పులు చేయకుండానే, అదనంగా మరొకరికి అవకాశం కల్పించే వ్యూహాన్ని అధిష్ఠానం అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, బీజేపీ జాతీయ నాయకత్వం చివరి నిమిషంలో నిర్ణయాలు మార్చడంలో ప్రసిద్ధి చెందినందున, ఈ విస్తరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉత్కంఠ కొనసాగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రంగంలోకి సీఎం టీమ్....

హైదరాబాద్, జూన్ 30 తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు ముగుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చ నడుస్తోంది. ప్రజా పరిపాలనపై ప్రజల అసలు అభిప్రాయం ఏంటి? క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిష్ట ఎలా ఉందనే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. ఇంటెలిజెన్స్, థర్డ్ పార్టీ నివేదికలను పక్కన పెట్టి, కేవలం తన సొంత నమ్మకస్థులతో కూడిన 'సీఎం టీమ్'ను రేవంత్ రెడ్డి రంగంలోకి దించడం ఇప్పుడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ వ్యతిరేకత రాకముందే అప్రమత్తమవ్వడం, లోపాలను సరిదిద్దుకుంటూ ఎన్నికల మూడ్‌ను ఇప్పటి నుంచే సెట్ చేయడమే లక్ష్యంగా సీఎం స్వయంగా ఈ సర్వే ప్రక్రియను మానిటరింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రత్యేక సర్వేను సీఎం టీమ్ తొలుత మంత్రుల నియోజకవర్గాల్లో ప్రారంభించనుంది. ఆ తర్వాతే మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు విపక్షాల చేతిలో ఉన్న నియోజకవర్గాల్లోనూ ఈ టీమ్స్ పర్యటించనున్నాయి. ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లాయి? స్థానిక ప్రజలకు, పార్టీ క్యాడర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో పార్టీ పట్టు ఎలా ఉంది? ఎమ్మెల్యేల గ్రాఫ్ ఎలా ఉంది? ఎక్కడెక్కడ అసంతృప్తి వ్యూహాలు నడుస్తున్నాయి? అనే విషయాలను సీఎం అత్యంత రహస్యంగా క్రోడీకరిస్తున్నారు.ఈ సర్వే ద్వారా వచ్చే డేటాను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం చేస్తున్నారు. సర్వే విశ్లేషణ ఆధారంగా పార్టీ పరంగా, ప్రభుత్వ అభివృద్ధి పరంగా వెనుకబడిన జిల్లాలను ప్రత్యేకంగా ఫిల్టర్ చేయనున్నారు. ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు, ఇన్-ఛార్జ్ మంత్రులను అలర్ట్ చేసి క్యాడర్‌లో నూతనోత్తేజం నింపేందుకు సీఎం కార్యాచరణ రూపొందిస్తున్నారు. మరోవైపు, ప్రజాక్షేత్రంలో పట్టు కోల్పోతున్న ప్రజాప్రతినిధులకు తమ పనితీరు మార్చుకోవాలని గట్టి హెచ్చరికలు జారీ చేసేందుకు కూడా వెనుకాడబోరని గాంధీ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికే ప్రభుత్వం పనితీరు, నెరవేరని హామీలపై సునీల్ కనుగోలు టీమ్ ఉమ్మడి పది జిల్లాల్లో సర్వే చేసి సీఎంకు కీలక రిపోర్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలో కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. కొన్ని జిల్లాల్లో బీఆర్ఎస్, మరికొన్ని జిల్లాల్లో బీజేపీ కాంగ్రెస్‌కు గట్టి ఫైట్ ఇవ్వనున్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మెరుగ్గా ఉన్నాయని ఈ రిపోర్ట్ తేల్చినట్లు సమాచారం. దీంతో పార్టీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపు ఎలా మళ్లించాలనే దానిపై ప్రభుత్వ పెద్దలు కసరత్తులు ప్రారంభించారు. బీజేపీ ఓటు బ్యాంకు బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ కాకుండా ఉంటేనే కాంగ్రెస్‌కు పూర్తి లాభం జరుగుతుందని సునీల్ టీం సూచించినట్లు సమాచారం. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి తమ టీమ్ సర్వే చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తుందని సునీల్ టీమ్ హామీ ఇచ్చింది. అంతేకాకుండా, పార్టీ సోషల్ మీడియా టీమ్‌లను హ్యాండిల్ చేసేందుకు కూడా ఈ టీమ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.మిగతా రాష్ట్రాల్లో అధికార పార్టీలు ఎదుర్కొన్న చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ మార్క్ పాలనను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చే ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా ఎదగడానికి సీఎం వేసిన ఈ 'సర్వే వ్యూహం' రాష్ట్ర రాజకీయాల్లో ఏ రకమైన మార్పులు తీసుకువస్తుందో చూడాలి.

# బెంగాల్ ఫార్ములా పనిచేస్తుందా...

హైదరాబాద్, జూన్ 30 తెలంగాణలో విజయమే లక్ష్యంగా పనిచేయాలని.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. దీనికిగాను ఈ ఏడాది జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అక్కడ ప్రజా పోరాటాల ద్వారానే అధికారం దక్కించుకున్నామని నాయకులకు చెప్పారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడా విజయం దక్కించుకోవాలన్నారు.అయితే.. తెలంగాణలో బెంగాల్ ఫార్ములా పనిచేస్తుందా? అనేది కీలక ప్రశ్న. రాష్ట్ర విభజన అనంతరం.. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన పలు ప్రాజెక్టులు, నిధులు ఇప్పటి వరకు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన జరిగింది యూపీఏ(కాంగ్రెస్) హయాంలోనే అయినా.. ఆతర్వాత..వరుసగా ఇప్పటివరకు 12సంవత్సరాలుగా బీజేపీనే అధికారంలో ఉంది. అలాంటప్పుడు.. రాష్ట్రాన్ని ఇచ్చామన్న క్రెడిట్‌లో తమకు భాగం ఉందని చెబుతున్నా.. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణకు ఏమేరకు సాయం అందించారన్నది ప్రశ్న.ముఖ్యంగా బెంగాల్‌కు, తెలంగాణకు మధ్య పోలిక లేదు. అక్కడ క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టులు పట్టుకోల్పోవడం, నిన్నటి వరకు అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై అవినీతి, అక్రమాల ముద్ర పడడం.. మమతా బెనర్జీ తర్వాత.. ఎవరు? అనే ప్రశ్నకు కుటుంబ పరంగా నాయకులు ముందుకు వచ్చిన దరిమిలా.. ప్రజలు వారిని తిరస్కరించడం అనేది బీజేపీకి కలిసి వచ్చింది. అదేసమయంలో బీజేపీకి.. సువేందు అధికారం ఐకాన్ నాయకుడిగా ఉన్నారు. ఇవన్నీ కలిసి వచ్చి.. బీజేపీ పాగా వేసిందనే అభిప్రాయం ఉంది.

కానీ, తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుత అధికార పార్టీపై అవినీతి, అక్రమాల ముద్ర పడలేదు. క్షేత్రస్థాయిలో అధికారులపై మాత్రమే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని సరిచేసుకునే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. ఇక, బీజేపీలో బెంగాల్ తరహా ఐకాన్ నాయకుడు తెలంగాణలో లేకపోవడంతోపాటు.. పార్టీలో ఆధిపత్య, అంతర్గత కుమ్ములాటలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరోవైపు.. ఓడిపోయినప్పటికీ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పట్టు సడలలేదు.మరోవైపు.. కవిత వంటి నాయకురాళ్లు దండిగా ఉన్న నేపథ్యంలో బెంగాల్ తరహా రాజకీయాలు తెలంగాణలో చేయడం సాధ్యం కాదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, కీలకమైన మరో విషయం.. సీఎం రేవంత్ రెడ్డిపై బలమైన యువ నేతగా, మంచి గళం ఉన్న నాయకుడిగా కూడా గుర్తింపు ఉంది. సో.. ఇవన్నీ.. ఉండగా బెంగాల్ ఫార్ములాను నమ్ముకోవడం అన్నది తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చని అంటున్నారు.

## ఆరోగ్య సమస్యలపై ప్రజలు నేరుగా సంప్రదించవచ్చు

### - జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో రోజుకు సుమారు 1200 మంది వరకు ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారని జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్ తెలిపారు. వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి తాగాలని, బయట ఆహారం, కలుషితమైన ఆహార పదార్థాలను తీసుకోరాదని సూచించారు. భోజనం ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆసుపత్రికి అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామ ని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సూపరింటెం డెంట్ జిల్లా ఆసుపత్రి రూమ్ నెం.16లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆసు పత్రి సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సూచనలు, ఆరోగ్య సమస్యలపై కూడా ప్రజలు నేరుగా సంప్రదించ వచ్చని, ఫోన్ ద్వారా ఎప్పుడైనా స్పందించేందుకు సిద్ధంగా ఉంటారని జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మీ పాపం నిరంతరం శాపంగా వెంటాడుతుంది కేటీఆర్

హైదరాబాద్ రైతుబంధు/రైతు భరోసా నిధులు, కాంగ్రెస్ ప్రభుత్వ ఎగవేతలపైన బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.30 నెలల కాంగ్రెస్ ముదనష్టపు పాలనలో.. దాదాపు 30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా అని నిలదీసారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా ?? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారని అన్నారు.

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి 15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీచేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే 50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్ లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్ గా 11 సార్లు, 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండని అన్నారు.

## వైఎస్ జగన్ను కలిసిన సింగపూర్ కాన్సులేట్ జనరల్



విజయవాడ వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సింగపూర్ కాన్సులేట్ జనరల్ (చెన్నై) ఎడ్గర్ పాంగ్తే చియాంగ్ మంగళవారం కలిసారు. సోమవారం నాడు మంత్రి లోకేష్ ను సింగపూర్ కాన్సులేట్ జనరల్ బృందం కలిసింది. మంగళవారం నాడు వైఎస్ జగన్తో భేటీ అయింది.

## విజయవాడ ధర్నా చౌక్లో తీవ్ర ఉద్రిక్తత..

### కదం తొక్కిన రైతులు

విజయవాడ విజయవాడ ధర్నా చౌక్ లో వామపక్షాలు కదం తొక్కాయి. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం డౌన్ డౌన్.. రైతు ద్రోహి చంద్రబాబు అంటూ ఆందోళన కారులు నినాదాలు చేసారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో "సీఎంకు రాయబారం" కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రైతు సంఘం నాయకులు, రైతులు సీఎం ఇంటికి బయల్దేరారు. పోలీసులు బారికేడ్లు పెట్టి రైతులను అడ్డుకున్నారు. పోలీసులతో రైతులు తీవ్రవాగ్వాదానికి దిగారు. పోలీసుల ఆంక్షలను దాటి సీఎం ఇంటికి వెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. ధర్నాచౌక్, స్వర్ణపాలెస్ జంక్షన్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు

# పోలింగ్ స్టేషన్స్ జాబితా తయారీ గురించి చర్చిస్తాం

### ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

### నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యంకు లేఖ

చిలకలూరిపేట, నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఎస్ ఐ ఆర్ విషయంలో రిజిస్టర్ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు రాసిన లేఖకు స్పందించిన ఏపీ సీఈఓ రాష్ట్ర పరిధిలో అన్నీ జిల్లాల కలెక్టర్లకు లెటర్. ఔనీ.803/ఎలక్స్.బి /ఏ 1/2026-1 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఎలక్టోరల్ రోల్స్ మాన్యువల్, 2023లోని 11వ అధ్యాయం ప్రకారం, ఎలక్టోరల్ రోల్స్ తయారీకి సంబంధించి గుర్తింపు పొందిన జాతీయ మరియు రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలతో డిఇఓ లు మరియు సీఈఓ లు అందరూ సమావేశాలు నిర్వహించాలని తెలియజేయడమైనదని,పోలింగ్ స్టేషన్ల మాన్యువల్, 2020లోని పేరా 3.4 ప్రకారం, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించేటప్పుడు జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు పొందిన మరియు గుర్తింపు పొందని రాజకీయ పార్టీల స్థానిక ప్రతినిధులు, నమోదైన మరియు పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులతో సంప్రదింపులు జరపాలని ఉత్తర్వులు జారీ చేస్తూ, కాపీ ప్రతి రావు సుబ్రహ్మణ్యం కు పంపించారు. స్పందించి ఆదేశాలు ఇచ్చిన సీఈఓ వివేక్ యాదవ్ కు నవతరం పార్టీ నుండి కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం రేవంత్ తో సునీల్ భారతి మిట్టల్ భేటీ

హైదరాబాద్ ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు తెలంగాణలో చేపట్టిన అనేక కార్యక్రమాలు, సంస్కరణలను వివరిస్తూ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన అంశాలను ప్రస్తావించారు.

ప్రత్యేకంగా విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తున్న తీరును వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అధునాతన సాంకేతిక విధానాలతో ఏటీసీలుగా మార్చిన విషయాలను తెలిపారు. ఇదే కోవలో పాలిటెక్నిక్ కాలేజీల అధునికీకరణ గురించి చెప్పారు. చందన్వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఒఎ మౌలిక సదుపాయాల క్యాంపస్ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు.

హైదరాబాద్లో ఎయిర్టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఒఎ కార్యకలాపాలపైన దృష్టి పెట్టాలి మిట్టల్ గారికి సూచించారు. రాష్ట్రంలో భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్లు అందజేస్తామన్న సునీల్ మిట్టల్ తెలిపారు. అలాగే, ఎయిర్టెల్కు రెండో హెడ్ క్వార్టర్గా హైదరాబాద్ను పరిగణిస్తున్నామని చెప్పారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. తెలంగాణలో ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ ఆసక్తిని ప్రదర్శించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు కూడా ఉన్నారు.

## చిలకలూరిపేటలో తృటిలో తప్పిన ప్రమాదం



చిలకలూరిపేట ఎన్టీఆర్ కాలనీ వద్ద పాఠశాల వదిలిన సమయంలో రోడ్డుపైకి వచ్చిన విద్యార్థులను కాపాడేందుకు ఆక్సిజన్, హైడ్రోజన్ సిలిండర్లతో వెళ్తున్న ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో విద్యార్థులు సురక్షితంగా బయటపడగా, సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థుల భద్రతపై పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను పట్టుకున్న పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. బూర్గంపాడు మండలం సారపాకలో గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్లో కోట్ల రూపాయల విలువైన గంజాయి ఉన్నట్లు సమాచారం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో భారీగా గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయిని తరలిస్తున్న కంటైనర్ను స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక సమాచారం ప్రకారం కంటైనర్లో సుమారు రెండు నుంచి మూడు కోట్ల రూపాయల విలువ చేసే గంజాయి ఉన్నట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న కంటైనర్ను సారపాకలోని ఐటీసీ పేపర్ కర్మాగారం లారీ యార్డుకు తరలించి పోలీసులు భద్రపరిచినట్లు సమాచారం.సంఘటన సమాచారం అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠా ఎవరనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాములవారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న తలపా దామోదరం రెడ్డి.



శ్రీకాళహస్తి మండలం, జగ్గరాజు పల్లి పంచాయతీ, జగ్గరాజుపల్లి గ్రామం నందు నూతనంగా నిర్మింపబడిన రాములు వారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు యానాది నవీన్ కుమార్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శశి, సురేష్,మహేష్, లక్ష్మయ్య, మాస్,అరుణ్ మరియు గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగి ఆత్మహత్య కేసు: నిందితురాలి అరెస్ట్?



రేణిగుంట తిరుపతి జిల్లా రేణిగుంట స్థానిక పట్టణంలో సంచలనం సృష్టించిన రైల్వే ఉద్యోగి కిల్లి రవి ఆత్మహత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ఎస్. ఉషారాణి (35)ను రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేశారు.?

?పోలీసుల కథనం ప్రకారం... కిల్లి రవి ఆత్మహత్య చేసుకున్న తర్వాత రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్, పోస్ట్మార్టం నివేదిక, సేకరించిన కీలక ఆధారాలు మరియు సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా తిరుపతిలోని మంగళం ప్రాంతానికి చెందిన ఎస్. ఉషారాణిని ఈ కేసులో ముద్దాయిగా నిర్ధారించారు.?కరకంబాడి బస్టాండ్ సమీపంలో అరెస్ట్:?రేణిగుంట మండలం కరకంబాడి బస్టాండ్ సమీపంలో నిందితురాలు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు, రేణిగుంట సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై . శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు."నిందితురాలిని చట్టప్రకారం అరెస్టు చేసి, విచారణలో భాగంగా ఆమె నుండి కేసునకు సంబంధించిన పలు వివరాలను సేకరించాము. చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ ఆమెను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తాము. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది."

# సీఎస్ఐఆర్-ఐఐసీటీ ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధన సౌకర్యాల ప్రారంభం, నూతన హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేసిన డాక్టర్ జితేంద్ర సింగ్





హైదరాబాద్, జూన్ 30, 2026: భారత శాస్త్రీయ పరిశోధనా మౌలిక సదుపాయాలను, ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్-ఐఐసీటీ) ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలను కేంద్ర శాస్త్ర, సాంకేతికత, భూ విజ్ఞాన శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇవాళ ప్రారంభించారు. దీనితో పాటుగా 200 మంది విద్యార్థులు ఉండగలిగే ఆధునిక హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు.

ప్రారంభించిన నాలుగు అత్యాధునిక పరిశోధనా కేంద్రాల్లో.. ఫ్లోరో కెమికల్స్ కోసం అధునాతన ఆర్ అండ్ డీ కేంద్రం, వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి, నిరంతర శుద్ధి సంకేతికతల (కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్) పరిశోధన, సస్టెయినబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక సాంకేతిక అభివృద్ధికి సీఎస్ఐఆర్-ఐఐసీటీ అందిస్తున్న నిరంతర సహకారాన్ని అభినందించారు. సైన్స్ ఆధారిత ఆర్థిక వృద్ధి, సాంకేతిక స్వావలంబన, స్థిరమైన అభివృద్ధి ద్వారా వికసిత్ భారత్ కలను సాకారం చేయటంలో భారతదేశ పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

జాతీయ అవసరాలను తీర్చేలా, పరిశ్రమలకు ఉపయోగపడేలా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా శాస్త్రవేత్తలు సరికొత్త, ఉన్నత స్థాయి పరిశోధనలు చేయాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావటం, అంకుర సంస్థలకు మద్దతివ్వటం, మేధో హక్కులు, పరిశ్రమలతో భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవటంపై సీఎస్ఐఆర్-ఐఐసీటీ ప్రత్యేకంగా దృష్టి సారించటాన్ని అభినందించారు. ఆధునిక పరిశోధనా రంగానికి ఇవి కీలకమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమం సందర్భంగా 200 మంది విద్యార్థులు ఉండగలిగే నూతన హాస్టల్ సముదాయానికి డాక్టర్ జితేంద్ర సింగ్ శంకుస్థాపన చేశారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు కానున్న ఈ హాస్టల్.. పరిశోధకులకు, సాధారణ విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన నివాస వసతిని కల్పిస్తుంది. ఇది ఉత్సాహభరితమైన విద్యా వాతావరణాన్ని సృష్టించటమే కాక, దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన యువ పరిశోధకులను ఆకర్షించేందుకు సీఎస్ఐఆర్-ఐఐసీటీ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

ఈ సమావేశంలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డీ. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రీయ రంగంలో సంస్థకున్న ఎనిమిది దశాబ్దాల విశిష్ట వారసత్వాన్ని, అత్యాధునిక పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, పరిశ్రమలతో భాగస్వామ్యం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా జాతీయ లక్ష్యాలకు మద్దతివ్వటంలో సంస్థ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. పరిశ్రమలు, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడే సాంకేతికతలుగా శాస్త్రీయ ఆవిష్కరణలను ఈ సంస్థ మారుస్తోందని చెప్పారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ పరిశోధనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయటంలో నూతన సౌకర్యాల ప్రారంభోత్సవం కీలక ఘట్టమని డాక్టర్ శ్రీనివాస రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ప్రయోగశాలల డైరెక్టర్లు, నేషనల్ సైంటిఫిక్ ఇనిస్టిట్యూషన్ల అధిపతులు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఉన్నతాధికారులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు

ఫ్లోరో కెమికల్స్ కోసం ఏర్పాటు చేసిన అధునాతన ఆర్ అండ్ డీ సంస్థ.. ఔషధాలు, అగ్రో కెమికల్స్, శీతలీకరణ కారకాలు, ఎలక్ట్రానిక్స్, ప్రత్యేక రసాయన పదార్థాల్లో ఉపయోగించే తదుపరి తరం ఫ్లోరోకెమికల్స్‌ను అభివృద్ధి చేయటంలో భారతదేశ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది.

ఈ సదుపాయం స్వదేశీ సాంకేతికత అభివృద్ధికి తోడ్పడుతుందని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, పర్యావరణహిత ఫ్లోరినేషన్ సాంకేతికతలను ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి కోసం ఏర్పాటు చేసిన వికేంద్రీకృత వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం.. శాస్త్ర, సాంకేతికత విభాగం మద్దతుతో సీఎస్ఐఆర్-ఐఐసీటీ అభివృద్ధి చేసిన వినూత్న వ్యర్థ జలాల శుద్ధి సాంకేతికతను ప్రదర్శిస్తుంది.

మెరుగైన పారిశుద్ధ్యం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన ప్రజల ఆరోగ్యం ద్వారా సిరిపురంలోని దాదాపు 6,700 మంది నివాసితులు ప్రయోజనం పొందుతారు. తక్కువ ఖర్చుతో, ప్రకృతి ఆధారిత పరిష్కారంగా, కనీస నిర్వహణ అవసరాలతో రూపొందించిన ఈ సదుపాయం.. దేశవ్యాప్తంగా ఉన్న టెక్స్‌టైల్ క్లస్టర్లు, చేనేత వర్గాలకు నమూనాగా నిలుస్తుంది.

కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ ఫెసిలిటీ.. ఔషధాలు, ఫైన్ కెమికల్స్, ప్రత్యేక రసాయనాల నిరంతర ఉత్పాదకతకు అధునాతన వేదికను ఏర్పాటు చేస్తుంది. ఈ సదుపాయం సురక్షితమైన రసాయన చర్యలను, మెరుగైన ఉత్పత్తి నాణ్యతను, ప్రక్రియల సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రయోగశాలల్లో పరిశోధనల నుంచి వాణిజ్య ఉత్పత్తి స్థాయికి వేగంగా చేరుకునేలా చేయటమే కాక, వ్యర్థాల ఉత్పత్తిని, ఇంధన వినియోగాన్ని తగ్గిస్తుంది.

ఇంజినీరింగ్ ప్రక్రియలు, పరికరాల ధ్రువీకరణ, సాంకేతిక ప్రదర్శనల కోసం సమగ్ర పైలట్ స్థాయి మౌలిక సదుపాయాలను పర్యావరణహిత ఇంజినీరింగ్ కాంప్లెక్స్ అందిస్తుంది. ప్రయోగశాల స్థాయి ఆవిష్కరణలకు, పారిశ్రామిక వినియోగానికి మధ్య కీలక అంతరాన్ని పూరించేందుకు పరిశోధకులకు ఇది వీలు కల్పిస్తుంది.

## పిడుగుపాటుకు గురైన రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

# బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 30** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోనిఅంకంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై 22 ఆవులను కోల్పోయిన పేద రైతు మంకిడి సమ్మయ్య కుటుంబాన్ని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లికాకులమ్రి లక్ష్మణ్ బాబు మంగళవారం స్వయంగా సందర్శించారు. బాధిత రైతు ఇంటికి వెళ్లిన ఆయన, మొన్న ఫోన్లో ఇచ్చిన మాట ప్రకారం ఈరోజు రూ. 20,000 ( రూపాయలు)నగదును ఆర్థిక సహాయంగా బాధితుడికి అందజేశారు

ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ,ఆవులను నమ్ముకుని జీవిస్తున్న ఒక పేద రైతు కుటుంబానికి ఇంత పెద్ద నష్టం జరగడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పరంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జీవనాధారమైన పశువులను కోల్పోయి రోడ్డున పడిన పేద రైతును ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి, ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందించి పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ బాబు గారితో పాటు బీఆర్ఎస్ నాయకులు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్ రావు, కాటాపురం సర్పంచ్ దిద్ది మోహన్రావు,దండు గల మల్లయ్య ముంద్రాతి రాజమౌళి ఎండి వాలి బాబా ఆలేటి ఇంద్రారెడ్డి ను శెట్టి రమేష్ ఎండి రఫీ మేడిశెట్టి నరసింహయ్య గున్ను దంతనపల్లి నరేందర్ తడక హరీష్, తడక సాయి లంజపల్లి వెంకటేష్ పుల్లూరు గౌరమ్మ అందగట్ల సాంబయ్య మంకిడి రఘు సమ్మయ్య రవి,బీరెల్లి సర్పంచ్ విజయ, చంద్రం, మాజీ జెడ్పిటిసి ఫులసం సరోజన, పురుషోత్తం, మాజీ ఎంపీపీ కొండూరి నరేష్, మాజీ ఎంపిటిసి దానక నర్సింహరావు, దిలావర్ ఖాన్, ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు, యలవర్తి శ్రీనివాసరావు, వహీద్, రోషయ్య, బెజ్జురి శ్రీకాంత్, రామకృష్ణ, గొప్ప స్వామి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్ పోస్టుకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ - మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్

**పెద్దపల్లి, జూన్ 30, ప్రజాబలం ప్రతినిధి :** ?రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ ప్రోగ్రాంలో ఖాళీగా ఉన్న ఒక మెడికల్ ఆఫీసర్ పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. హిమబిందు సింగ్ మంగళవారం తెలిపారు. ?ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలని, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లేదా నేషనల్ మెడికల్ కమిషన్‌లో చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, జూలై 1వ తేది ఉదయం 11గంటలకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అభ్యర్థులు తమ విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రం, ఇతర సంబంధిత అన్ని ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, పూర్తి వివరాల కోసం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సంప్రదించాలని మెడికల్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

సహకార సంఘాల బలోపేతంతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం

## ఎఫ్‌పీఓ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 30:2026 జూన్ 29 నుండి జూలై 6 వరకు జరుగుచున్న సహకార వారోత్సవాల సందర్భంగా సిండికేట్ ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సంఘం ఆల్వాల్ వారి ఆధ్వర్యంలో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

ఆర్. సురేఖ రాణి మాట్లాడుతూ సహకార నియమాలు, చట్టాలు మరియు రైతులకు లభించే ప్రయోజనాలను నొక్కి చెప్పారు.

ఎఫ్ పి ఓ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆర్. సురేఖ రాణి, జాయింట్ రిజిస్ట్రార్ / తెలంగాణ సహకార సంఘం జి. శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి, మెడ్చల్ మల్కాజిగిరి,

తోట గోపాల్ రెడ్డి చైర్మన్, సొసైటీ ఛైర్మన్ మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీ ఆర్.ఎం.వి. ఆనంద్ రావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## పదవీ విరమణ పొందిన యస్.ఓ.యం అల్లాఉద్దీన్ కు సన్మానం



**పెద్దపల్లి/గోదావరిఖని, జూన్-30, ప్రజాబలం ప్రతినిధి:** 2 మరియు 2ఎ గనిలో యస్.ఓ.యంగా 37 సంవత్సారాలుగా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందుతున్న అల్లాఉద్దీన్ యస్.ఓ.యం ను అర్జీ 1 జియం ఆఫీస్ లో జియం లలిత్ కుమార్ అధ్యక్షతన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా వారిని అన్ని విభాగాల ఉన్నతాధికారులు వారికి పూలమాలలు మరియు శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి వారు సింగరేణి కి చేసిన సేవలపై కొనియాడారు. జియం మాట్లాడుతూ వారు క్రమశిక్షణతో స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని, పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరూ పదవి విరమణ పొందుతారని, వారి శేష జీవితం సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. అనంతరం వారికి సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జియం చంద్రశేఖర్, ఎజంట్స్, మేనేజర్లు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే అసలైన సంపద

## -- జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 30:**ప్రభుత్వ విధులలో భాగంగా ప్రజలకు నేరుగా సేవలందించడం వారితో మంచిగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారం, చేతనైన సహాయం అందిస్తే వారు చాలారోజుల వరకు మనల్ని గుర్తు చేసుకుంటారని అదే అసలైన సంపద అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అభిప్రాయపడ్డారు.



హౌజింగ్ పిడి రమణ మూర్తి, కలెక్టర్ సిసి బాల భాస్కర్, హౌజింగ్ ఎఈ సుభాష్ రెడ్డి, కలెక్టరేట్ ఆఫీస్ సబార్డినేట్ జర్మియాజ్ ల పదవి విరమణ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ మను చౌదరి హాజరైనారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో భాగంగా ప్రజలకు మనం చేయగలిగినంత మంచి చేయాలని అన్నారు. ఈ మధ్య కాలంలో ఇందిరమ్మ ఇళ్లు, 2 బిహెచ్ కె ఇళ్ల సంబంధించి 30, 40 వేల అప్లికేషన్స్ వరకు వచ్చాయని, అందులో పిడి ఎంతో ఓపికతో అర్హులైన అందరికి ఇళ్లు ఇప్పించేందుకు ఎంతగానో కృషి చేసారన్నారు. ప్రజల సొంత ఇంటి కల నేరవేర్చే దిశలో హౌజింగ్ పిడిది కీలక పాత్ర అన్నారు. ఆయన 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు అందించారని పదవి విరమణ అనంతరం వారి కుటుంబానికి సమయాన్ని కేటాయిస్తూ వారి అభిరుచికి తగినట్లు తమ సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బాల భాస్కర్ కలెక్టర్ కు అధికారులకు, కలెక్టరేట్ వచ్చే ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉండడమే కాకుండా, ఎంతో ఓపికగా కలెక్టరేట్ కు వచ్చే విజిటర్స్ తో మాట్లాడుతూ షెడ్యూల్స్ ఏర్పాటు చేస్తుంటారని కలెక్టర్ అన్నారు. ఇప్పటి వరకు 5,6 మంది సిసిలు నాతో పని చేసారని, అందులో భాస్కర్ చాలా బెస్ట్ అని కలెక్టర్ కొనియాడారు. పదవి విరమణ పొందిన వారిని కలెక్టర్ శాలువా, మెమెంటో తో సత్కరించారు. అంతకు ముందు అదనపుకలక్టర్, వివిధ శాఖల అధికారులు వారి సేవలను కొనియాడారు. అలాగే పదవి విరమణ పొందిన పై వారందరి జీవితం, ఆరోగ్యం ప్రశాంతతో సంతోషం, విజయాలతో నిండాలని కోరుకున్నారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి.

## 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి లారీ డ్రైవర్ మృతి..




**సత్తుపల్లి ప్రతినిధి జూన్30 ప్రజాబలం:** సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. లారీలో తరలిస్తున్న జేసీబీ యంత్రం 11 కేవీ విద్యుత్ లైన్‌ను తాకడంతో లారీకి విద్యుత్ ప్రవహించి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

సీతారామ ప్రాజెక్టు క్యాంపులో పనిచేస్తున్న రెడ్డి పోగు వెంకటేశ్వరరావు (40) జేసీబీ యంత్రాన్ని లారీలో తరలిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను జేసీబీ తాకడంతో లారీ మొత్తం విద్యుత్ ప్రవహించింది. దీంతో డ్రైవర్ తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

మృతుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనతో మృతుడి స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సత్తుపల్లిలో నగరాభివృద్ధి పనులను పరిశీలన

## మున్సిపల్ చైర్ పర్సన్.





**సత్తుపల్లి ప్రతినిధి జూన్30 ప్రజాబలం:** సత్తుపల్లి మున్సిపాలిటీలోని 7, 19, 20, 23 వార్డుల్లో జరుగుతున్న నగరాభివృద్ధి, పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏఈ సురేష్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్మాణంలో ఉన్న నూతన డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేవి శ్రీను, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, రామారావు, వెంకటరెడ్డి నారాయణరెడ్డి, విరివాడ నాగభూషణం, కమల్ పాషా, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఏసిబికి చిక్కిన ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

## ఓ రైతు నుంచి 2 లక్షల మొత్తాన్ని స్వీకరిస్తూ పట్టుపడిన ఎల్. శ్రీనివాస్ .



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్30 ప్రజాబలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. అశ్వారావుపేట మండలంలోని దొంతికుంట చెరువు నుంచి శిఖం భూమిలో మట్టి తోలుకునేందుకు అనుమతి కోసం ఓ రైతు ఇరిగేషన్ విభాగానికి చెందిన ఏఈఈ శ్రీనివాస్ ను సంప్రదించారు. ఇందుకు రైతు నుంచి ఆయా ఇంజనీర్ రూ. 4.00 లక్షల మొత్తాన్ని లంచంగా డిమాండ్ చేశాడు. అయితే ఇంజనీర్ కు లంచం ఇవ్వడం ఇష్టం లేని రైతు ఏసీబీ అధికారులను సంప్రదించారు.

ఈమేరకు వలపన్నిన ఏసీబీ అధికారులకు ఏఈఈ శ్రీనివాస్ తన కార్యాలయంలోనే రూ. 2 లక్షల మొత్తాన్ని లంచంగా స్వీకరిస్తూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు.

## ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన

హుజురాబాద్ టౌన్, జూన్ 30 హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని హుజూరాబాద్ టౌన్ సెక్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, వ్యవసాయదారులకు విస్తృత అవగాహన కల్పించామని కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) శ్రీ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందికి విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి 'వన్ మినిట్ సేఫ్టీ' సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని, ఏవైనా లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు ఉపయోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పొడవైన విద్యుత్ లైన్లపై మధ్య స్తంభాల ఏర్పాటు, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ మార్పిడి, వదులుగా ఉన్న వైర్ల (లూజ్ స్పాన్లు) సరిదిద్దడం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను ఎత్తు పెంచడం, వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు

# తెలంగాణ వ్యవసాయానికి సమగ్ర భరోసా అవసరం

## (సి.హెచ్.ప్రతాప్)

వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం. రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించి, సాగుకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారుతోంది. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు నిరంతరం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సాగు ప్రారంభ దశలో అందే ఆర్థిక సహాయం రైతులకు ఊరటనిస్తోంది. అయితే రైతుల ఆదాయం స్థిరంగా పెరగాలంటే పెట్టుబడి సాయం మాత్రమే సరిపోదు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే సమగ్ర చర్యలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణలో వర్షాధార వ్యవసాయం అధికంగా ఉండటంతో వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో సూక్ష్మ సాగునీటి పద్ధతులు, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వరి వంటి సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యాన, పప్పు, నూనెగింజల పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశాలు ఉన్నాయి.

వ్యవసాయంలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించడం కూడా అత్యంత అవసరం. డ్రోన్ల ద్వారా పంటల పరిశీలన, డిజిటల్ వాతావరణ సూచనలు, శాస్త్రీయ సలహాలు, యాంత్రీకరణ రైతుల ఉత్పాదకతను పెంచగలవు. అదే విధంగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, విలువ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెటింగ్ సదుపాయాలు అభివృద్ధి చెందితే రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుంది.

రైతు భరోసా వంటి పథకాలు తక్షణ ఆర్థిక ఉపశమనాన్ని అందిస్తే, సుస్థిర వ్యవసాయ విధానాలు రైతుల భవిష్యత్తుకు భరోసాను కల్పిస్తాయి. ఆర్థిక సహాయం, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన మార్కెట్ వ్యవస్థ, నీటి నిర్వహణ, పంట బీమా వంటి అంశాలు పరస్పరం అనుసంధానమైనప్పుడే వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుంది. రైతు సంక్షేమాన్ని తాత్కాలిక సహాయానికి పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక ఆదాయ భద్రతను కల్పించే దిశగా ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సంస్థలు, రైతులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. అదే తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి శాశ్వత పునాదిగా నిలుస్తుంది.

# పాఠశాల... ఆసుపత్రులపై ప్రైవేట్ పెత్తనం


## అంతా కార్పొరేట్ లోకమే...

## సామాన్యుడికి హక్కుల.. వ్యాపారాల...?

## తుంగలో తొక్కుతున్న చట్టాలు

**చంద్రుగొండ జూన్ 30 ప్రజాబలం ప్రతినిధి:–** సమాజంలో ప్రస్తుతం విద్యా, వైద్యం పై ప్రైవేట్ పెత్తనం అధికమైందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతుంది. ఒకప్పుడు విద్య, వైద్యం ప్రాథమిక హక్కుగా బలంగా ఉండేది. అయితే విద్య, వైద్యం వ్యాపార ధోరణిగా బలపడింది. సాధారణ అభివృద్ధి అంటే కేవలం ఆకాశ హర్మ్యాలు కాదు. భారీ జీడీపీ వృద్ధి, స్టాక్ మార్కెట్ రికార్డులు, విదేశీ పెట్టుబడుల గణాంకాలు మాత్రమే ఒక దేశ అభివృద్ధికి కొలమానాలు కావు. ప్రతి పౌరుడు గౌరవప్రదంగా జీవించే అవకాశం, ప్రతిబిడ్డకు నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి అందుబాటు వైద్యం ఉన్నప్పుడే ఆ దేశాన్ని నిజంగా అభివృద్ధి చెందిన దేశంగా చెప్పవచ్చు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం విద్య ప్రతి చిన్నారికి ప్రాథమిక హక్కు. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో ఆరోగ్య రక్షణ అంతర్భాగమే. అలాగే ఆర్టికల్ 47 ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం రాష్ట్రం యొక్క ప్రధాన బాధ్యతగా పేర్కొంటుంది. అయినప్పటికీ నేడు విద్య, వైద్యం ప్రజల హక్కులుగా కాకుండా అధిక




వ్యయంతో కొనుగోలు చేయాల్సిన సేవలుగా మారుతున్నాయనే విమర్శలు పెరుగు తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు" సమానత్వానికి ప్రతీకగా ఉండేవి. ప్రభుత్వ ఆసుపత్రులు పేదల చివరి ఆశ్రయంగా నిలిచేవి. కానీ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలికసదుపాయాల లోపం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, పరికరాల కొరత ప్రజలను ప్రైవేట్ రంగం వైపు మళ్లిస్తోంది. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు అత్యాధునిక సదుపాయాలతో సేవలు అందిస్తున్నప్పటికీ, వాటి ఖర్చులు సాధారణ కుటుంబాలకు భారంగా మారుతు న్నాయి. ఈ పరిస్థితికి ఒక్క ప్రభుత్వం లేదా ఒక్క సంస్థను మాత్రమే బాధ్యులుగా చూపడం సరైంది కాదు. దశాబ్దాలుగా ప్రజా విద్య, ప్రజావైద్య రంగాలపై తగిన పెట్టు బడులు తగ్గడం, ప్రభుత్వ వ్యవస్థల బలోపేతంలో నిర్లక్ష్యం, ప్రైవేటీకరణకు అధిక ప్రాధాన్యం, నియంత్రణ వ్యవస్థల బలహీనత, సేవా రంగాల్లో లాభాలకే ప్రాధాన్యం ఇచ్చిన మార్కెట్ ధోరణి ఇవన్నీ కలిసి ఈ పరిస్థితికి దారితీశాయి. సమాజం కూడా నాణ్యమైన ప్రభుత్వ సేవల కోసం నిరంతరం ఒత్తిడి తీసుకురాకపోవడం ఒక కారణంగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఒక రైతు తన కుమారుడి చదువు కోసం భూమిని అమ్ముకోవాల్సి వస్తోంది. ఒక మధ్యతరగతి కుటుంబం వైద్య ఖర్చుల కోసం జీవితాంతం కూడబెట్టిన పొదుపును ఖర్చు చేయాల్సివస్తోంది. ఒక పేద విద్యార్థి ప్రతిభ కంటే ముందుగా ఫీజు గురించి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడు తోంది. ఒక రోగి చికిత్స కంటే ముందు ఆసుపత్రి బిల్లును చూసి ఆందోళన చెందుతున్నాడు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం అభివృద్ధి అంటే కొద్దిమందికి విలాసవంతమైన సేవలు అందుబాటులో ఉండటం కాదు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, అందుబాటు వైద్యం, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను బలోపేతం చేయడం, ప్రజా పెట్టుబడులను పెంచడం, ప్రైవేట్ రంగంపై సమర్థవంతమైన నియంత్రణ అమలు చేయడం, సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారానే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమాన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని నిపుణులు సూచిసు న్నారు. ఒక దేశం గొప్పదనం దాని సంపదలో కాదు... తన అత్యంత బలహీనమైన పౌరుడికి కూడా గౌరవప్రదమైన జీవితం, నాణ్యమైన విద్య, అందుబాటు వైద్యం కల్పించగల సామర్థ్యంలోనే ఉంటుంది. అభివృద్ధి గణాంకాలు శీర్షికలుకావచ్చు. కానీ ప్రజల జీవితాలను మార్చేది ప్రజా కేంద్రిత పాలన, బలమైన ప్రభుత్వ విద్యా–వైద్య వ్యవస్థలేనని ఈ పరిస్థితి మరోసారి గుర్తు చేస్తోంది.

# చెత్తకుప్పలో వెంకన్న చిత్రపటాలు

## టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన

తిరుపతి స్వామి వారి చిత్రపటాలు మలమూత్రాలు మధ్య, బీరు బాటిల్స్ మధ్య ఉన్నాయి. అలిపిరి –జూపార్క్ రోడ్డులో టీటీడీ నిర్లక్ష్యం ఇదని టీటీడీ మాజీ ఛైర్మన్ పై భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎం చంద్రబాబు పాలనలో టీటీడీ పరిరక్షిస్తున్నామంటూ గొప్పలు చెప్తునే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వందలవేల స్వామి వారి ఫొటోలు అన్ని కూడా అత్యంత నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో పడేశారు. టీటీడీ వాళ్లు పడేసారు అని చెప్పడం లేదు.. విజిలెన్స్ వైఫల్యం చెప్తున్నాం. టీటీడీ ఈవో, ఛైర్మన్ బి.ఆర్ నాయుడు తో సహా చంద్రబాబు ఊడిగం చేసే మీరు సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూన్30 ప్రజాబలం:** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారు
కె. సుబ్బారావు ఎస్సై
వి. లక్ష్మణ్ రావు ఆర్ఎస్ఐ
జి.వి. సుబ్బారావు ఏఆర్ఎస్ఐ
కె. కృష్ణయ్య ఏఆర్ఎస్ఐ
బి. కృష్ణ రావు ఏఆర్ఎస్ఐ
వి. రామ్ ప్రకాష్ రావు ఏఆర్ఎస్ ఐ
కె. శ్రీనివాసా చారి ఏఎస్ఐ
సిహెచ్.వెంకటేశ్వరరావు ఏఎస్ఐ
షేక్.అబ్దుల్ హమీద్ ఎఎస్ఐ
సత్యనారాయణ హెడ్ కానిస్టేబుల్
వి.వెంకటేశ్వర్లు హెడ్ కానిస్టేబుల్
కె. శ్రీనివాసరావు హెడ్ కానిస్టేబుల్
షేక్. లాల్ సాహెబ్ హెడ్ కానిస్టేబుల్
కె. బుల్లయ్య హెడ్ కానిస్టేబుల్

కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సిసిఆర్బీ ఏసీపీ సాంబరాజు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సిఐ సర్వయ్య, ఆర్ఐలు కామరాజు, నాగుల్ మీరా, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ఖచ్చితంగా పాటించాలి.
## ఎంపీడీవో శ్రీధర్ రాజు



**ఖమ్మం జిల్లా ప్రతినిధిజూన్30 ప్రజాబలం:** మల్లవరం గ్రామంలో నూతనంగా చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్ రాజు సర్పంచ్ కటిక కిరణ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గ్రామాభివృద్ధికి రోడ్ల నిర్మాణం ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీ ఎర్రి నరసింహారావు, ప్రముఖ రైతు శ్రీ అయినాల రామలింగయ్య, స్థానిక పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ మియా, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డిపై విషప్రచారం మానుకోవాలి:
## కాంగ్రెస్ నాయకులు.. రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్

సూర్యాపేట జిల్లా : నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు ప్రజల నుంచి లభించిన విశేష ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.మంగళవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నల్గొండ సభ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకత్వం భయాందోళనకు గురైందన్నారు. అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రిని విమర్శించే ముందు తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. తన హయాంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియాలకు అండగా నిలిచి కోట్ల రూపాయల దోపిడీ జరిగిందనే ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, పోలీసు శాఖ అధికారుల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.దళిత బంధు పథకం అమలులో లబ్ధిదారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలను ప్రజలు మర్చిపోలేదని పేర్కొంటూ, ఆ ఆరోపణలు అసత్యమైతే బహిరంగంగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైన్ షాపుల కేటాయింపుల్లో బినామీల ద్వారా సిండికేట్‌లు ఏర్పాటు చేసి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా మాజీ ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు.కోదాడ ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద కోట్ల రూపాయల విలువైన ఆస్తి కబ్జా ఆరోపణలపై కూడా బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇతరులపై విమర్శలు చేసే ముందు తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని అన్నారు. తన హయాంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలు, ఎంపీపీ, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ అధ్యక్షుల నియామకాల కోసం డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తద్దు
## సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
## తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్.

జగిత్యాల 2027 లో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలసి గోదావరి తీరంలో మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికి ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గానికి రూ. 117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు.ధర్మపురి క్షేత్రానికి పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తాగునీటి సౌకర్యం, డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ కొరకు గత గోదావరి పుష్కరాలకు, కృష్ణ పుష్కరాలకు పనులు చేసిన ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధులు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తారని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో పాటు వేముల రాజు, ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న , వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ప్రశాంత్, వోజ్జల లక్ష్మణ్ లతో పాటు జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
## పారిశుధ్యం, వన మహోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలి
## :: జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 30 మేడారం** మంగళవారం మేడారం సమ్మక్క-- సారలమ్మ జాతర అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, వన మహోత్సవ కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మేడారం హరిత హోటల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మేడారం పరిసర ప్రాంతాల్లో వన మహోత్సవ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, కార్యనిర్వాహక అధికారులు పరస్పర సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల నుంచి మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చి నాటేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



మేడారం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్, ఎం. సంపత్ రావు, జిల్లా పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ, మేడారం పూజారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి పాఠశాలల్లో చిన్నారుల సమగ్ర అభివృద్ధి
## స్కూల్ రెడీనెస్ మేళాలో సీడీపీవో శిరీష




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 30 ములుగు** ములుగు మంగళవారం , జూన్ 30: చిన్నారుల శారీరక, మానసిక, మేధో మరియు సామాజిక అభివృద్ధికి అంగన్వాడి పాఠశాలలే ఉత్తమ వేదిక అని ములుగు ప్రాజెక్టు సీడీపీవో శిరీష అన్నారు. మంగళవారం.ములుగు మండలం కొడిశెలకుంట సెక్టార్‌లోని శ్రీరాములపల్లి గ్రామ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ రెడీనెస్ మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలు, కథల ద్వారా విద్యను బోధిస్తారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో బట్టీ విధానంలో బోధన సాగుతుండగా, అంగన్వాడీల్లో పిల్లల ఆసక్తిని పెంపొందించే విధంగా ఆనందదాయకమైన అభ్యాసం జరుగుతుందని వివరించారు. గ్రామ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ, గ్రామంలోని తల్లిదండ్రులంతా 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి పాఠశాలలకు పంపించాలని కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి అంగన్వాడి విద్య ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
ఉపసర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ, అంగన్వాడి టీచర్లు పిల్లలను తల్లిలా చూసుకుంటూ మంచి అలవాట్లు, క్రమశిక్షణ, ఆటలు, పాటలు నేర్పిస్తారని తెలిపారు. సెక్టార్ సూపర్వైజర్ సరస్వతి కూడా చిన్నారుల వ్యక్తిత్వ వికాసంలో అంగన్వాడి కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ మాస్టర్ ట్రైనర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, అంగన్వాడి విద్య ద్వారా చిన్నారుల్లో శారీరక, భాషా, మేధో, పూర్వగణిత నైపుణ్యాలు మెరుగుపడి, భవిష్యత్తులో మెరుగైన విద్యా ప్రగతి సాధించేందుకు పునాది ఏర్పడుతుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ తిరుపతి, సీడీపీవో శిరీష, సెక్టార్ సూపర్వైజర్ సరస్వతి, అంగన్వాడి టీచర్లు, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏటూరు నాగారం నూతన సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 30** ఏటూరునాగారం నూతన సి ఐ గా బాధ్యతలు స్వీకరించిన జి.సూర్య ప్రకాష్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు మరియు మండల కాంగ్రెస్ పార్టీ బృందం...
బినూతన బాధ్యతలకు అభినందనలు తెలిపిన నాయకులు..
ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జి సూర్య ప్రకాష్ గారిని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు...ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ఏటూరునాగారం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు...
ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ సీనియర్ నాయకులు, యువజన నాయకులు,ప్రజాప్రతినిధులు,మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# మధ్యాహ్న భోజన వంట కార్మికులకు రావలసిన తొమ్మిది నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలి,

## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోని వంట కార్మికులను రోడ్డున పడే పరిస్థితులను విరమించుకోవాలి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పదివేల వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయవలెను, ఏఐటీయూసీ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 30 ములుగు** మంగళవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం మరియు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ గారికి,, డీఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కార నిమిత్తం అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహిస్తూనే ఉన్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం చాలా అన్యాయం అయిన విషయం అన్నారు, విద్యకు పెద్దపీట వేస్తున్నాం, విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం,మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం, అందులో కోడిగుడ్లు అందిస్తున్నాం, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని అనేక వాగ్ధానాలు చేస్తూ నిధులను కూడా కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు పలుకుతూ,,అందులో పని చేస్తున్న వంట కార్మికులను మాత్రం విస్మరించడం, వారి వేతనాల విషయంలోగాని, నిత్యవసర సరుకులు పెరిగినందున మెనూ ఛార్జీలు పెంచే విషయం గాని, లేదా మొత్తం సరుకులు ప్రభుత్వం సరఫరా చేయు విషయం పట్టించుకోకుండా తాతలనాడు పెంచిన రేట్లను పెంచకుండా,, ఈరోజు కూడా అమలు చేయాలని కార్మికులపై ఒత్తిడి చేస్తే ఎలా సాధ్యమవుతుంది అన్నారు, మార్కెట్లో పెరిగిన ధరలకు వంట కార్మికులు చాలా నష్టపోవలసిన పరిస్థితిలు ఉన్నందున ప్రభుత్వం ఆలోచన చేయవలసిందే అని,,ఈ పేరుతోని వంట కార్మికులు నాణ్యమైన భోజనాలు అందిస్తలేరు అనే సాకుతోని, కోడిగుడ్లు పెడుతలేరని సాకుతోని ఎక్కడ కూడా కార్మికులను తొలగించడానికి వీలు లేదు అన్నారు, ఒకవేళ ఎక్కడైనా రాజకీయ ఇతరత్ర కారణాలతో కార్మికులను తొలగించినట్లయితే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయవలసి ఉంటుందని హెచ్చరించారు,,గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం 9 నెలల పెండింగ్ బిల్లులను మూడు సంవత్సరాలు దాటుతున్నా విడుదల చేయకపోతే కార్మికులు ఎలా జీవిస్తారు అన్నారు,, అదే కాక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అధికారంలోకి రాగానే వంటకార్మికులకు రూపాయలు పదివేల వేతనాలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి నేటికీ దానిపైన సమీక్ష కూడా చేయకపోవడం చాలా అన్యాయం అయిన విషయం అన్నారు,,అల్పాహారం పథకానికి రాష్ట్రవ్యాప్తంగా కేవలం 28 కోట్ల రూపాయలు బకాయిలు ఉంటే విడుదల చేయకపోవడం ఏమిటి అన్నారు, కనుక విద్యార్థులపై ఎలాగైతే ప్రభుత్వం శ్రద్ధ కనపరుస్తుందో అది నిర్వహించే వంట కార్మికులపై కూడా అంతే శ్రద్ధ వహించాలని సూచించారు,, ఎక్కడ కూడా కార్మికుల పరిస్థితిపై ముఖ్యమంత్రి గారు ఊసెత్తడం లేదు అన్నారు, ఈ సమస్యల పరిష్కార నిమిత్తం ఇప్పటికే గ్రామీణ స్థాయి నుండి మండలాలు జిల్లా స్థాయి వరకు ఆందోళన వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే ఉన్నాము ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పై డిమాండ్స్ అమలు చేయాలని అన్నారు,, ఆందోళనలు ఉధృతం కాకముందే సమస్యలు పరిష్కరించాలని సమస్యలను అడుగుతుంటే కార్మికులను మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా తొలగించడానికి కూడా సిద్ధపడడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు,, ఏఐటీయూసీ నాయకులు ముత్యాల రాజు,సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి జిల్లా ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, ,గున్నాల రాజకుమారి, సామ సమ్మక్క, కుడుముల సమ్మక్క,భవాని, సలువాల స్వరూప, మద్దిబోయిన భారతి, సరోజన, కవిత, మౌనిక, చంద్ర, నాగమణి, సుమతి, విజయలక్ష్మి, షఫియా, తులసి, లావణ్య, సరిత, కుమారి, మణెమ్మ, శ్రీనివాస్, కనకలక్ష్మి, నాగమణి, జానకి, రాధిక, శ్రీలత, సావిత్రి, వనజ,

# గో టూ విలేజీ ప్రోగ్రాం ఎమ్మార్పీఎస్




**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 30** ములుగు జిల్లా వెంకటాపురంమండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించరు ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు పుల్లూరు కరుణాకర్ మాదిగ అధ్యక్షతన జులై 7 న ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి.

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ జాతికి అందించారు

విద్యా ఉద్యోగాల్లో ముందుకు రావాలి .

ముఖ్య అతిథి:- చాతల రమేష్ ములుగు జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడడం జరిగింది

మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మార్గనిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం వీ౯ాా ఆధ్వర్యంలో 40 రోజుల పాటు గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు తెలిపారు . యువకులతో సమావేశం నిర్వహించడం జరిగింది

మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న వీ౯ాా ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెలని నిర్మాణం చేసుకోవాలని కోరారు.జులై 7 న మాదిగ జాతి పండుగగా వీ౯ాా జెండా పండుగ చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కొడారి సత్యం మాదిగ యాసం రాంబాబు మాదిగ వంకాయ కృష్ణ దాసు కొడారి రక్షణ వంకాయల నితిన్ తదితరులు పాల్గొనడం జరిగింది

# రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ౹ాఎఖీ ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం

,గోదావరిఖని: భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (౹ాఎఖీ) పురోగతిపై రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి చేరుకుని ౹ాఎఖీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు, ఇంచార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.౹ాఎఖీ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాల సేకరణలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో, గ్రామాల్లో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డివిజన్, గ్రామాల ఇంచార్జ్‌లు తమ పరిధిలో జరుగుతున్న ౹ాఎఖీ కార్యక్రమం పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.ఈ సమావేశం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**జహీరాబాద్, జూన్30 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలోని వార్డ్ నెం. 11లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్ళను మహిళల పేరుతో మంజూరు చేస్తూ వారి కుటుంబంలో ప్రత్యేక గుర్తింపు, భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ప్రతి మహిళ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్ గౌస్ గౌరీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నవీద్, మెప్మా అనిత, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు శంకుస్థాపన



**జహీరాబాద్ జూన్ 30 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా పలు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీ కొనింటి మాణిక్‌రావు శంకుస్థాపన చేశారు.

ఝరాసంగం మండలం పోట్పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, యువ నాయకులు కొనింటి మిథున్‌రాజ్, గ్రామ సర్పంచ్ శ్యామల మొగుళ్లయ్య, సిద్ధన్న పటేల్, నర్సింలు, సునీల్, జాన్సన్, శ్రీకాంత్, బస్వరాజ్ పటేల్, మొగులప్పతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కోహీర్ మండలం కొత్తూరు (డి) గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, గ్రామ సర్పంచ్ మాణిక్ ప్రభు, ఉప సర్పంచ్ ఆనంద్, బోయినీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు, కేంద్ర నిర్వహణను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన అంగన్వాడీ టీచర్ విషయమై సీడీపీవోతో మాట్లాడి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా, గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు హెచ్చరిక బోర్డులు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు

# ఉపాధి హామీ వందరోజుల పనిలో బాధితునికి గాయాలు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 30** 100 రోజుల పని వద్ద ట్రాక్టర్ డోర్ కాలు మీద పడి గాయపడిన బాధితుడు బెల్లం రాజును పరామర్శించిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్

చిటమట రఘు..

మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ గారిని కోరడం జరిగింది.

మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు,జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు... బిఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామానికి చెందిన బెల్లం రాజు 100 రోజుల పనికి పోయిన వద్దా ట్రాక్టర్ ట్రాలీ డోర్ వేస్తుండగా ట్రాక్టర్ ట్రాలీ డోర్ బెల్లం రాజు కాలు మీద పడడంతో పాదం వద్ద 2 వెళ్ళు విరిగిపోయాయి. మెరుగైన వాయిద్యంఅందించాలని డాక్టర్ కోరారు.అధికారులతో ఫోన్లో మాట్లాడి అతని న్యాయం జరిగే విధంగా చూడాలని, వైద్య ఖర్చులు అందించాలని కోరారు.బిబాధితుడికి ధైర్యం చెప్పి కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని తెలియజేశారు.బిఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్ కుమార్,పిఎసిఎస్ డైరెక్టర్ వంగపల్లి రవి,వార్డు నెంబర్ ముమ్మనేని రమేష్,గంపల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట వాసులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

జమ్మికుంట, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు సంక్షేమం అభివృద్ధి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం నాడు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది,30 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. నిరుపేదలు పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో అండగా ఉంటుందని, ఇప్పటివరకు హుజురాబాద్ లో సుమారు 10కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పారదర్శకతను పాటిస్తున్నామని త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వబోతున్నామని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏవరైనా డబ్బులు అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజా ప్రజాప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు,

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com